


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 6 సంచిక: 15, పేజీలు - 08
శుక్రవారం, జులై 10, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# పాతబస్తీలో ఎస్ఐఆర్ ప్రకంపనలు

- పాతబస్తీలో ఓటరు సంక్షోభం
- ఎస్ఐఆర్ పై మైనారిటీల్లో అభద్రతా భావం
- కర్ణాటక మోడల్ డిమాండ్‌పై రేవంత్ సర్కార్ సైలెన్స్!




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ పాతబస్తీ లో నివసించే మైనారిటీ వర్గాల ఓటర్లు ప్రస్తుతం తీవ్రమైన అభద్రతా భావంతో పాటు ఒక రకమైన సాంకేతిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పాతబస్తీలోని వేలాది మంది పేద ముస్లిం ఓటర్ల పాలిట ఒక పెద్ద శాపంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. దశాబ్దాలుగా ఇక్కడే పుట్టి పెరిగి, ప్రతి ఎన్నికల్లోనూ తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నప్పటికీ నూతన సవరణ నిబంధనలు, కఠినమైన పత్రాల కొరత కారణంగా చాలా మంది పేర్లు ఓటరు జాబితా నుంచి శాశ్వతంగా గల్లంతయ్యే పరిస్థితి ఏర్పడింది.

### డాక్యుమెంట్లు కష్టమే

పాతబస్తీలోని సామాజిక, ఆర్థిక పరిస్థితులను గమనిస్తే.. ఇక్కడి జనాభాలో అత్యధికులు అద్దె ఇళ్లలో, మురికివాడల్లో నివసించే పేద వర్గాలే. మారుతున్న నిబంధనల ప్రకారం ఓటు నమోదుకు లేదా సవరణకు సరైన అడ్రస్ ప్రూఫ్, ఆధార్ లింకేజ్, గ్యాస్ లేదా ఎలక్ట్రికల్ బిల్లులు వంటి పక్కా పత్రాలను అధికారులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, చాలా కాలంగా ఒకే ప్రాంతంలో స్థిర నివాసం లేని వారికి, సరైన అవగాహన లేని పేదలకు ఈ పత్రాలను సమర్పించడం ఒక పెద్ద సవాలుగా మారింది. దీంతో క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చే అధికారులు నిబంధనల సాకుతో వేలాది మంది ఓట్లను తొలగిస్తున్నారని, ఇది కేవలం ఒక మున్సిపల్ వార్డుకో లేదా నియోజకవర్గానికో పరిమితం కాకుండా మొత్తం పాతబస్తీ పొలిటికల్ డెమోగ్రఫీని మార్చేసేంత

2లో..

పశ్చిమాసియా ఉద్రిక్తతలపై
# మోదీ ఆందోళన

- చర్చలు, దౌత్యంతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్న మోదీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్న నేపథ్యంలో, సమస్యల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే ఏకైక మార్గమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన, గురువారం మెల్‌బోర్న్‌లో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు పాల్పడటంతో, అమెరికా ప్రతిగా సైనిక చర్యలు చేపట్టింది. ఇరాన్‌కు చెందిన బుషెహర్, చాబహార్ సహా పలు తీర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలపై దాడులు జరిపినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ దాడులతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఈ పరిణామాలపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన మోదీ, "ప్రపంచంలో కొనసాగుతున్న ఏ వివాదానికైనా చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం సాధ్యమవుతుంది" అని స్పష్టం చేశారు.

2లో..

మాన్యుఫ్యాక్చరింగ్ జోన్‌లోకి
# పరిశ్రమల తరలింపు

తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెడతామన్న సీఎం రేవంత్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు అంతర్భాగం మొత్తంగా కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. 2,100 చ.కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఓఆర్ఆర్ లోపల కోర్ అర్బన్ ఏరియాలో 1 కోటి 35 లక్షల జనాభా అవసరాలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

సోలార్ మాడ్యూల్స్ తయారీ రంగంలో ప్రసిద్ధ ప్రిమియర్ ఎనర్జీస్ సంస్థ రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో నెలకొల్పిన 5.6 గిగావాట్ల సామర్థ్యం కలిసిన సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

### ఓఆర్ఆర్ బయటకు పరిశ్రమలు

ప్రిమియర్ ఎనర్జీ రూపొందించిన మొట్టమొదటి సోలార్ ఆక్సీ ట్రీ - సోలార్ పవర్డ్ స్ట్రీట్ లైట్,

2లో..

29 గ్రామాల ప్రతినిధులతో
# ప్రత్యేక కమిటీ

అమరావతి రైతు జేఏసీ కీలక నిర్ణయం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం, సీఆర్డీఏ అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు అమరావతి 'రైతు జేఏసీ' ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతి పరిధిలోని మొత్తం

2లో..

# భూ వివాద రహిత ఏపీనే లక్ష్యం

- గత పాలకుల పాపాలకు ప్రక్షాళన చేసామన్న చంద్రబాబు



- బనగానపల్లెలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని వెల్లడి
- భూవివాద రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం
- రాయలసీమలో భారీ పరిశ్రమలు, హార్టికల్చర్ హబ్‌తో అభివృద్ధికి బాటలు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, ఆంధ్రప్రదేశ్‌ను భూవివాద రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుల అరాచకాలు, పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయని, వారి నల్ల చట్టాలను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తున్నామని ఆయన అన్నారు. గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించిన 'మీ భూమి- మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లను పంపిణీ చేసి ప్రజావేదిక సభలో ప్రసంగించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఒక నల్ల చట్టమని, ప్రజల ఆస్తులను కాజేసేందుకు, వారిలో భయాందోళనలు సృష్టించేందుకే దానిని తెచ్చారని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామని గుర్తుచేశారు.

"గత పాలకులు తమకు నచ్చని వారిని భయపెట్టేందుకు వారి భూములను 22ఏ జాబితాలో పెట్టేశారు.

2లో..

# బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్ల అవినీతి సొమ్ము

- బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న నిధులు స్వచ్ఛమైనవి కావన్న కవిత
- ఆ డబ్బులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చాయని ఆరోపణ
- ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలో చేరనని వ్యాఖ్య




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సింగరేణిలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై మీడియాతో మాట్లాడిన టీఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్ల అవినీతి సొమ్ము ఉందని అన్నారు. దీన్ని వెంటనే అమరవీరుల కుటుంబాలకు పంచాలని డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉండగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లేది లేదన్నారు. తాను మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్తానంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణి కార్మికులకు కోసం 20వ తేదీ నుంచి నిరవధిక దీక్ష చేస్తున్నట్టు ప్రకటించారు. టీఆర్ఎస్ అనే పేరు తనకు రాకుండా ఉండాలనే

2లో..

చైనాలో ఘోర
# అగ్నిప్రమాదం

- షూ ఫ్యాక్టరీలో 28 మంది సజీవ దహనం



బీజింగ్ (ప్రశ్న న్యూస్) చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఆగ్నేయ చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో గల ఒక షూ ఫ్యాక్టరీలో గురువారం భారీ మంటలు చెలరేగడంతో 28 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. భవనంలో

2లో..

కాంగ్రెస్‌లో కాకరేపుతున్న
# వరంగల్ పంచాయితీ

- కడియం శ్రీహరిపై మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లా స్థాయి నాయకుల మధ్య సమన్వయం లోపం పెను దుమారం రేపుతూనే ఉంది. ఇప్పటికే ఇలాంటి పంచాయితీలు భరించలేని నాయకులు తమ దారి తాము చూసుకున్నారు. మరికొందరు సైలెంట్ అయిపోయారు. ఇప్పుడు తాజాగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కడియం శ్రీహరి, మంత్రి కొండ సురేఖ మధ్య వివాదం తలెత్తింది. తన శాఖలో విషయాలపై తన శాఖ కమిషనర్‌తో కడియం శ్రీహరి ఎలా సమీక్ష జరుపుతారని కొండా సురేఖ నిలదీస్తున్నారు. కచ్చితంగా ఇది ఆయన అహంకారనికి నిదర్శనమని అంటున్నారు. అయితే ఇది అవగాహన లోపం కారణంగానే జరిగిందని కడియం శ్రీహరి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఈ వివాదాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సురేఖ, తాజాగా

2లో..

హైదరాబాద్‌లో ఒలింపిక్స్
# నిర్వహణ నా కల

- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, వెబ్‌సైట్ ప్రారంభం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ వేదికగా ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించడమే తన వ్యక్తిగత కల అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. క్రీడా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్?లోని గచ్చిబౌలిలో 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ'తో పాటు గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

2లో..

22ఏ సంకెళ్లు తెంచిన
# కూటమి ప్రభుత్వం

- గుటుపల్లి రైతుల ఆనందం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** నంద్యాల జిల్లాలో దశాబ్దాలుగా నలుగుతున్న క్లిష్టమైన భూ సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పర్యటనలోనే తక్షణ పరిష్కారం చూపారు. బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామానికి చెందిన 897 మంది రైతుల 2,074 ఎకరాల భూములను నిషేధిత 22ఏ జాబితా నుంచి విముక్తి కల్పించారు. కేవలం హామీ ఇవ్వడమే కాకుండా, బనగానపల్లె తహసీల్దార్

2లో..

# బండి భగీరథ్‌కు భారీ ఊరట

- పోక్సో కేసులో షరతులతో కూడిన బెయిల్!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. పోక్సో కేసులో అరెస్టు అయ్యి జైల్లో ఉన్న ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు అయ్యింది. ఇరు పక్షాల వాదన విన్న హైకోర్టు భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు పలు షరతులు విధించింది. దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించింది. సాక్షులను ప్రభావితం చేసే చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. లక్ష పూచికత్తు సమర్పించాలని పేర్కొంది.బండి భగీరథ్ తనపై అత్యాచారం చేశాడని 16ఏళ్ల బాలిక హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనకు మాయమాటలు

2లో..

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణ నా కల

భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి యూనివర్సిటీ లోగో, వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. హైదరాబాద్‌ను తిరిగి ఒక ప్రధాన క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రస్థానంలో ఇదొక కీలక ముందడుగు అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 1990 నుంచి 2004 మధ్య కాలంలో హైదరాబాద్ అనేక జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు వేదికగా నిలిచిందని, అయితే గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో అటువంటి మెగా ఈవెంట్లు జరగకపోవడంపై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 'తెలంగాణవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో నూతన క్రీడా విధానాన్ని రూపొందించామని తెలిపారు. ఇందులో భాగంగానే వచ్చే నవంబర్‌లో 'ఖేలో ఇండియా' గేమ్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. అపారమైన జనాభా కలిగిన భారతదేశం ఒలింపిక్ పతకాల సాధనలో వెనుకబడి ఉండటంపై రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల విధానపరమైన లోపాలే ఇందుకు ప్రధాన కారణమని ఆయన విమర్శించారు. చిన్న వయసులోనే ప్రతిభావంతులను గుర్తించి, వారికి అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చదువుతో పాటు క్రీడలు కూడా ఉపాధికి, ఉజ్వల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. 2036 ఒలింపిక్స్‌కు హైదరాబాద్ తరపున బిడ్ దాఖలు చేయాలని లేదా భారత్‌కు ఆ అవకాశం దక్కితే కనీసం కొన్ని క్రీడా విభాగాలనైనా ఇక్కడ నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగానే గచ్చిబౌలి స్టేడియాల ఆధునికీకరణ, నూతన స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి నిర్మాణాతక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

# 22ఏ సంకెళ్లు తెంచిన కూటమి ప్రభుత్వం

కార్యాలయంలోనే అధికారుల సమక్షంలో మొత్తం ప్రక్రియను దగ్గరుండి పూర్తి చేయించి, రైతులకు విముక్తి పత్రాలను అందజేశారు. గురువారం నంద్యాల జిల్లాలో పర్యటించిన సీఎం, 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు.

### అక్కడికక్కడే పరిష్కారం

ఈ ఏడాది మార్చి 9న డోన్ పర్యటనలో గుటుపల్లి రైతులు తమ భూములను గత ప్రభుత్వం అన్యాయంగా 22ఏ జాబితాలో చేర్చిందని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఆ వినతిని గుర్తుంచుకున్న ముఖ్యమంత్రి, గురువారం బనగానపల్లె పర్యటనలో ఆ రైతులను ప్రత్యేకంగా తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు. సమస్య పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో చర్యలు పూర్తయ్యాయని, జిల్లా స్థాయిలో ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని జిల్లా రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. కలెక్టర్ నుంచి అధికారిక ఉత్తర్వులు అందనందున ఆన్‌లైన్ ప్రక్రియ మొదలు కాలేదని రిజిస్ట్రార్ చెప్పడంతో, సీఎం అక్కడికక్కడే కలెక్టర్‌తో మాట్లాడి ఉత్తర్వులను రిజిస్ట్రార్‌కు అందజేశారు. "త్వరలోనే పూర్తి చేస్తాం" అని అధికారి చెప్పగా, "త్వరలో కాదు, ఇప్పుడే పూర్తి చేయండి" అని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగి, గుటుపల్లికి చెందిన 2,074 ఎకరాలను 22ఏ జాబితా నుంచి ఆన్‌లైన్‌లో తొలగించారు. ఇదే స్ఫూర్తితో బనగానపల్లె పట్టణానికి చెందిన 23 మంది రైతుల 101 ఎకరాల చుక్కల భూములను కూడా నిషేధిత జాబితా నుంచి తప్పించారు.

### రైతుల ఆనందం

తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన భూములు తమ పేరు మీదే ఉన్నా, గత ప్రభుత్వ చర్యల వల్ల అమ్ముకోలేక, వ్యవసాయ రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడ్డామని రైతులు ముఖ్యమంత్రి వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యకు ఇంత వేగంగా, స్వయంగా ముఖ్యమంత్రి చొరవతో పరిష్కారం లభిస్తుందని కలలో కూడా ఊహించలేదని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిందని, రాష్ట్రంలో ఎక్కడా రైతులు ఇబ్బంది పడకూడదన్నదే తమ లక్ష్యమని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు రైతులకు భరోసా ఇచ్చారు.

### రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారంపై దృష్టి

బేతంచర్ల తరహాలోనే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో దశాబ్దాలుగా పేరుకుపోయిన భూ వివాదాలను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోంది. తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుంది గ్రామాల్లోని భూ సమస్యలకు ఇప్పటికే పరిష్కారం చూపింది. రీ సర్వే పేరుతో గత ప్రభుత్వం సృష్టించిన ఇబ్బందులను తొలగిస్తూ, లక్షలాది ఎకరాలకు విముక్తి కల్పిస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయాలతో వేలాది మంది రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తూ, కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేయడం ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

# మాన్యుఫ్యాక్చరింగ్ జోన్‌లోకి పరిశ్రమల తరలింపు

ఎయిర్ క్లీనింగ్ సిస్టమ్ 'ఆక్సీట్రీ'ని, యూనిట్‌లో సోలార్ మాడ్యూల్స్‌కు సంబంధించి వివిధ ఉత్పత్తులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ యూనిట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు చెన్నై లాంటి మెట్రోపాలిటన్ నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోని కారణంగానే చాలా కష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. 'ఆ నగరాల అనుభవాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలోని జీడిమెట్ల, బాలానగర్ లాంటి ఇండస్ట్రియల్ పార్కులున్న ప్రాంతాల్లో పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం, దానికితోడు మూసీ నది కాలుష్యంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే 2,100 చ.కి.మీ మేరకు విస్తరించి ఉన్న ఈ కోర్ అర్బన్ రీజియన్ లో పూర్తిగా కాలుష్యరహిత ప్రాంతంగా మార్చాలని సంకల్పించాం. పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించడానికి చట్టం చేశాం. ఓఆర్ఆర్ బయట పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ ప్రాంతంలో మాన్యుఫాక్చరింగ్ జోన్ గా గుర్తించాం. ఇక్కడి నుంచి తరలించిన పరిశ్రమలకు అవసరమైన స్థలాలను మాన్యుఫాక్చరింగ్ జోన్ లో కేటాయిస్తాం'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

### 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

'మాన్యూఫాక్చరింగ్ జోన్‌లో మొట్టమొదటగా ప్రారంభమైన సంస్థ ప్రీమియర్ ఎనర్జీ కావడం ప్రశంసనీయం. కేవలం 12 నెలల కాలంలో యూనిట్‌ను నెలకొల్పింది'అని ముఖ్యమంత్రి సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు ప్రాంతీయ మండళ్లుగా విభజించి సమగ్రమైన ప్రణాళికలతో ముందుకు వెళుతున్నాం. 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది, తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టాలన్నది మా సంకల్పం. వైట్ కాలర్ ఉద్యోగాలు కష్టమైన పరిస్థితులను అర్థం చేసుకుని యువత బ్లూకాలర్ జాబ్స్ అందిపుచ్చుకునే దిశగా నైపుణ్యతను పెంచడానికి ఎక్కువ దృష్టి సారించాం. ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి మొత్తంగా వ్యవస్థలను ఆ దిశగా సిద్ధం చేస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

### ప్రపంచంతో హైదరాబాద్ పోటీ పడాలి

'హైదరాబాద్ ప్రపంచంతో పోటీ పడాలంటే ఇప్పుడున్న పెట్టుబడులు, పరిశ్రమలు సరిపోవు. మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలు రావాలి. 2047 నాటికి వంద సంవత్సరాల స్వాతంత్ర్య ఉత్సవాలను జరుపుకోబోతున్న తరుణంలో వెనక్కి తిరిగి చూస్తే ఎక్కడ మొదలయ్యాం. ఎక్కడికి చేరుకోవాలనుకున్నామో ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలి'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'పెరిగిన కాలుష్యాన్ని నియంత్రించడానికి సోలార్ ఎనర్జీతో ఆక్సిజన్ పంపింగ్ చేసే యంత్రాలను ప్రీమియర్ ఎనర్జీ రూపొందించడం అభినందనీయం. అలాంటి పరిస్థితులు తలెత్తడంపై అందరూ ఆలోచన చేయాలి. ప్రకృతిని విధ్వంసం చేయడం వల్ల ఇలాంటి తీవ్రమైన పరిణామాలకు దారితీస్తోంది. నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అంతకన్నా ఎక్కువ ప్రజల నుంచి సంపూర్ణ సహకారం ఉండాలి'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, కాలే యాదయ్య, ప్రీమియర్ ఎనర్జీ చైర్మన్ సురేందర్ పాల్ సింగ్ సలూజా, మేనేజింగ్ డైరెక్టర్ చిరంజీవ్ సింగ్ సలూజా, డైరెక్టర్ సుధీర్ మూల, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రేవతి రోహిణి, ప్రభుత్వ అధికారులు, సంస్థ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# హైడ్రానిక్ విధానంతో పాత గృహాలకు సులువుగా లిఫ్ట్‌లు

నానాటికి అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతిక విధానంతో పాత గృహాలలో సైతం సులువుగా లిఫ్ట్ లను అమర్చుతున్నట్లు క్యూబ్ ఎలివేటర్స్ సంస్థ ఎండి చల్లా వెంకట అవినాష్ శర్మ తెలిపారు. ఎర్రమంజిల్ మెర్క్యూర్ హోటల్లో విలేకరుల సమావేశంలో ఇటలీకి చెందిన హైడ్రానిక్ లిఫ్ట్ సంస్థ ఎండి ఫెడరికో లామ తో కలిసి మాట్లాడారు. గతంలో పాత గృహాలకు లిఫ్టులు ఏర్పాటు చేయడం సాధ్యం కాదనే భావన ఉండేదని ప్రస్తుతం సులువుగా ఏర్పాటు చేయగలుగుతున్నట్లు చెప్పారు. కొద్దిపాటి స్థలంలో ఆధునిక సాంకేతికత తో రూపొందించిన ఎలివేటర్స్ ను తమ సంస్థ సమకూర్చుతోందని చెప్పారు. వయోభారంతో బాధపడుతున్న వృద్ధులకు ఈ సాంకేతికత అద్భుత పరిష్కారమని అన్నారు.

# పాతబస్తీలో ఎస్ఐఆర్ ప్రకంపనలు

తీవ్రమైనదిగా మారిందని మజ్లిస్ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

### ఓవైసీ కోరుతున్న కర్ణాటక మోడల్

పాతబస్తీ ప్రజల ఓట్లు గల్లంతు కాకుండా ఉండాలంటే వారికి కర్ణాటక తరహాలో శాశ్వత నివాస ధృవీకరణ పత్రం ' ఇవ్వాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. దీనివల్ల పత్రాల కొరత తీరి ఓటు హక్కు సురక్షితంగా ఉంటుందని మజ్లిస్ భావిస్తోంది. ఈ ఓటర్ల సవరణ ప్రక్రియ పాతబస్తీలో ఎంఐఎం పార్టీ గుత్తాధిపత్యానికి, సాంప్రదాయ ఓటు బ్యాంకుకు పెద్ద గండి కొట్టే ప్రమాదం ఉంది. మజ్లిస్ పార్టీకి ల్యాండ్ మార్క్ లాంటి పాతబస్తీ స్థానాల్లో ఓట్ల సంఖ్య భారీగా తగ్గితే, అది భవిష్యత్తులో ఆ పార్టీ రాజకీయ ఉనికికే నష్టం కలిగిస్తుంది. అందుకే ఈ సాంకేతిక సంక్షోభాన్ని పరిష్కరించేందుకు, ఓటర్లకు ఉపశమనం కలిగించేలా చట్టపరమైన నివాస ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని అసదుద్దీన్ ఓవైసీ గత కొన్ని నెలలుగా ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ దిశగా ఎలాంటి సానుకూల ప్రయత్నాలు చేయడం లేదని, కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని ఓవైసీ బహిరంగంగానే తన అసంతృప్తిని వెళ్లగక్కారు.

### మజ్లిస్‌ను పెద్దగా పట్టించుకోని రేవంత్

సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ఈ వ్యూహాత్మక మౌనం వెనుక పక్కా రాజకీయ లెక్కలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మజ్లిస్ పార్టీ అడిగిందే తడవుగా నిర్ణయాలు తీసుకునేవారు. కానీ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ మాత్రం పాతబస్తీలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే సవరణలు జరగనిస్తోంది తప్ప, మజ్లిస్ కోసం ప్రత్యేక మినహాయింపులు లేదా నివాస ధృవీకరణ పత్రాలు ఇచ్చేందుకు మొగ్గు చూపడం లేదు. ఒకవేళ ఇక్కడ ఓట్లు తగ్గిపోతే అది పూర్తిగా మజ్లిస్ పార్టీకే పొలిటికల్ డ్యామేజ్ కలిగిస్తుంది తప్ప, అక్కడ నామమాత్రపు బలం ఉన్న కాంగ్రెస్‌కు వచ్చే నష్టమేమీ లేదని రేవంత్ భావిస్తున్నారు. అంతేకాకుండా, మజ్లిస్‌కు లొంగిపోకుండా స్వతంత్రంగా వ్యవహరించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లిం మైనారిటీలకు తామే అసలైన ప్రత్యామ్నాయం అని నిరూపించుకోవాలనేది కాంగ్రెస్ దీర్ఘకాలిక వ్యూహం. ఈ పొలిటికల్ మైండ్ గేమ్ కారణంగానే పాతబస్తీ ఓటర్ల సమస్యపై ప్రభుత్వం అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తోంది.

### అర్హులైన అందరికీ ఓట్లు

పాతబస్తీలోని పేద ముస్లింల ఓటు హక్కు సాంకేతిక కారణాలతో గల్లంతవుతుండటం సామాజికంగా ఆందోళనకరమైన విషయమే అయినప్పటికీ, ఇది ఇప్పుడు కాంగ్రెస్ వర్సెస్ ఎంఐఎం మధ్య ఒక పెద్ద పొలిటికల్ వార్‌గా రూపాంతరం చెందింది. ఓవైసీ బ్రదర్స్ ఈ ఓటర్ల సంక్షోభాన్ని సాకుగా చూపి మైనారిటీలలో సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేస్తుండగా, రేవంత్ రెడ్డి మాత్రం నిబంధనల ప్రకారం సాగుతున్న ప్రక్రియలో జోక్యం చేసుకోకుండా మజ్లిస్‌ను మరింత డిఫెన్స్‌లోకి నెట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి ఈ ఓటర్ల గల్లంతు వ్యవహారం పాతబస్తీ రాజకీయ చిత్రపటాన్ని ఎలా మార్చబోతోందనేది అత్యంత ఆసక్తికరంగా మారింది.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మోదీ ఆందోళన

పౌరుల భద్రతను కాపాడాలని, వాణిజ్య కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని ఇరు దేశాల నేతలు సంయుక్త ప్రకటనలో కోరారు. పశ్చిమాసియాలో తలెత్తిన ఈ తాజా ఘర్షణలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు, వాణిజ్య మార్గాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత్ వంటి దేశాలకు చమురు సరఫరా, ఇంధన భద్రతకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే భారత్ తన ప్రయోజనాలను, ప్రవాస భారతీయుల భద్రతను దృష్టిలో ఉంచుకుని దౌత్యపరమైన పరిష్కారాన్ని ఆకాంక్షిస్తోంది.

# భూ వివాద రహిత ఏపీనే లక్ష్యం

వివాదాలు సృష్టించి భూములు లాక్కోవాలని చూశారు. భూమి పత్రాలపై, చివరికి సర్వే రాళ్లపై కూడా వారి ఫొటోలు వేసుకున్నారు. ఆ ఫొటోల పిచ్చిని రద్దు చేసి, ఇప్పుడు రాష్ట్ర రాజముద్రతో, పటిష్ఠమైన భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు అందిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. ఈ పంపిణీని ఒక పవిత్ర ఉద్యమంగా చేపడుతున్నామని, 2027 మార్చి నాటికి రాష్ట్రంలోని 9,833 గ్రామాల్లో 72,70,605 పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. తిరుపతి, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో ఏళ్లుగా నలుగుతున్న భూ వివాదాలను పరిష్కరించామని తెలిపారు. డోన్ నియోజకవర్గంలో 2,074 ఎకరాల వక్ఫ్ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి రైతులకు న్యాయం చేశామని చెప్పారు. ఆటో మ్యూటేషన్ ద్వారా వారసత్వ ఆస్తులను సులభంగా బదిలీ చేసే ప్రక్రియను అమలు చేస్తున్నామన్నారు.

రాయలసీమ ముఖచిత్రాన్ని మారుస్తున్నామని, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్, ఆమ్కా డిఫెన్స్ ఫైటర్ జెట్ ప్లాంట్ (స్టెల్త్ యుద్ధ విమానం) వంటి భారీ పరిశ్రమలు వస్తున్నాయని, ఇక్కడ తయారైన ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌లు దేశమంతా తిరుగుతాయని అన్నారు. రూ.40 వేల కోట్ల ప్రభుత్వ, రూ.60 వేల కోట్ల ప్రైవేట్ పెట్టుబడులతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 22 శాతం వర్షపాతం తక్కువగా నమోదైందని, ఈ నేపథ్యంలో నీటి భద్రత కోసం 'జలధార' కార్యక్రమాన్ని ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవడం ద్వారానే నీటి భద్రత సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ దిశగా 18 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, చెక్‌డ్యామ్‌లు నిర్మించిన నంద్యాల జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు.

# 29 గ్రామాల ప్రతినిధులతో ప్రత్యేక కమిటీ

29 గ్రామాల ప్రతినిధులతో ఒక ప్రత్యేక అభివృద్ధి కమిటీని త్వరలోనే ఏర్పాటు చేయాలని జేఏసీ నేతలు తీర్మానించారు. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం విడివిడిగా సీఆర్డీఏ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, దీనివల్ల అసలైన రైతుల ఉమ్మడి సమస్యలు పక్కదారి పడుతున్నాయని జేఏసీ అభిప్రాయపడింది. అందుకే అందరి తరపున మాట్లాడేలా ఒక అధికారిక కమిటీని తేవాలని నిర్ణయించింది.

రాజధాని నిర్మాణం కోసం తాము ఎప్పుడో భూములు ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో రైతులకు సంబంధించిన అనేక సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటయ్యే అభివృద్ధి కమిటీ ద్వారా ఈ సమస్యలన్నింటినీ నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంత అభివృద్ధి అనేది కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా 29 గ్రామాల్లోనూ సమానంగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "గతంలోనూ జేఏసీలు ఏర్పాటు చేశారు కానీ, వాటిలో సరైన కమిటీ వివరాలు లేవు. ఇప్పుడు ఎవరికి వారే తామే నాయకులమనే తీరుగా వ్యవహరిస్తున్నారు. అలా కాకుండా, కొత్త కమిటీలో ప్రతి గ్రామం నుంచి అన్ని కులాల వారికి సమాన ప్రాధాన్యత ఇస్తాం" అని రైతు జేఏసీ నేతలు వెల్లడించారు.

# ముందే పెళ్లి చేసుకున్న సియా

ముంబై, పుణేలోని లోహగడ్ కోటపై జరిగిన హత్య కేసులో రోజుకో సంచలన విషయం వెలుగులోకి వస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న సియా గోయల్ (20), తన బాయ్‌ఫ్రెండ్ చేతన్ చౌదరిని అప్పటికే రహస్యంగా వివాహం చేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో కీలక సమాచారం బయటపడింది. పుణేకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్‌తో (25) ఆమెకు నిశ్చితార్థం జరిగిన తర్వాత ఈ వివాహం జరగడం గమనార్హం. పోలీసు వర్గాల కథనం ప్రకారం.. సుమారు నాలుగు నెలల క్రితం సియా, చేతన్ ఒక స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రత్యేక వివాహ చట్టం కింద పెళ్లి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వివాహానికి సియా కాలేజీ స్నేహితులు ఇద్దరు సాక్షులుగా సంతకాలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వారిని కూడా విచారించేందుకు సిద్ధమవుతున్నారు.

ఈ రహస్య వివాహాన్ని నిర్ధారించుకునేందుకు పోలీసులు మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం గాలిస్తున్నారు. ఈ జంట పెళ్లి దండలతో ఉన్న కొన్ని ఫొటోలను ఒక ప్రైవేట్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి డిలీట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఫొటోలను తిరిగి పొందేందుకు టెక్నికల్ బృందాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ ఫొటోలు దొరికితే కేసులో ఇవి కీలక ఆధారాలుగా మారనున్నాయి. ఈ ఏడాది నవంబర్‌లో కేతన్, సియాల వివాహం ఉదయ్‌పూర్‌లో జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డెస్టినేషన్ వెడ్డింగ్ కోసం కేతన్ కుటుంబ సభ్యులు సియా డాక్యుమెంట్లు అడగడంతో రహస్య వివాహ విషయం బయటపడుతుందనే భయంతోనే హత్యకు ప్లాన్ వేగవంతం చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. తప్పనిసరి పబ్లిక్ నోటీసును తప్పించుకుని, రహస్య వివాహాన్ని త్వరగా పూర్తి చేయడానికి చేతన్ ఏమైనా మధ్యవర్తికి డబ్బులు చెల్లించాడా? అనే కోణంలో అతని బ్యాంక్ ఖాతాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. కేతన్ అగర్వాల్‌తో పెళ్లి ఇష్టం లేని సియా, జూన్ 18న అతడిని లోహగడ్ కోటకు తీసుకెళ్లి బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది. ప్రస్తుతం సియా గోయల్, చేతన్ చౌదరి ఇద్దరూ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్ల అవినీతి సొమ్ము

కుట్రతో ఈసీకి వెయ్యికి పైగా కంప్లైంట్స్ బీఆర్ఎస్ ఇచ్చిందని చెప్పారు. భయం లేదంటూనే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. నా ప్రజా పోరాటాలను ప్రజల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్, బీజేపీతో చేతులు కలుపుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఒక నీతి, నియమం అంటూ ఏమీ లేవా అని ప్రశ్నించారు. తల్లి, చెల్లె అనే సభ్యత మరిచి బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ఇష్టానుసారం కామెంట్లు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. సభ్యత మరిచి తిడితే ఊరుకునేందుకు ఇది ఆంధ్రా కాదు, కాళ్లు విరగొట్టి చేతుల్లో పెడతాం బిడ్డా అని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. కేటీఆర్ తన మిత్రుడు ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్‌ప్రో కో ద్వారా అక్రమ పర్మిషన్లు ఇచ్చారని అన్నారు. "కాళేశ్వరం అవినీతిలో అనకొండ అయిన హరీశ్‌రావు నే బీఆర్ఎస్ ఇంకా ముందు పెడుతోంది. ఇక ఆ పార్టీ జీవితంలో బాగుపడదని స్పష్టమైంది. చేసిన అవినీతి, పెద్ద ఆయనకు అంటించిన అవినీతి మరకలు చాలవన్నట్లుగా మూడు నెలలు మంత్రి పదవి కావాలంట?. బీఆర్ఎస్ మీద కోపంతో కాళేశ్వరం నీళ్లను ముఖ్యమంత్రి ఎత్తిపోయటం లేదు. అర కిలోమీటర్ రాళ్ల కట్ట కడితే మొత్తం నీళ్లు ఎత్తిపోసుకోవచ్చు." అని అన్నారు. పార్టీ పెట్టుకొని తన పని తాను చేసుకుంటూ పోతున్నానని, ఇప్పటి వరకు కూడా బీఆర్ఎస్ విషయంలో ఎక్కడ పర్సనల్ విషయాలు చెప్పలేదని కవిత అన్నారు. "పార్టీ పెట్టిన ఆరు నెలల వరకు అన్ని పార్టీల గురించి మాట్లాడి ఆ తర్వాత ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాను. కానీ నా పార్టీతో భయం లేదంటూనే బీఆర్ఎస్ వాళ్లు వెయ్యి కి పైగా ఈసీకి కంప్లైంట్స్ ఇచ్చారు. మా పార్టీకి సంబంధించిన వార్తలు రాసే వారికి గుంటనక్క ఫోన్లు చేస్తూ రాయవద్దని చెబుతోంది. అదే విధంగా 188 కోట్లు పెట్టి కేటీఆర్ ఇటీవలే పయోనీర్ అనే ఇంగ్లీష్ పేపర్ కొనుగోలు చేశాడు. క్విడ్ ప్రొకోలో భాగంగా తన మిత్రుడు ప్రదీప్ కన్ స్ట్రక్షన్‌కు అక్రమంగా పర్మిషన్లు ఇచ్చి పెద్ద భవనాలు కట్టుకునే అవకాశం ఇచ్చాడు. డబ్బు ఉంటే సోషల్ మీడియా, మీడియాను కొనుగోలు చేసి మా వార్తలు రాకుండా చేయాలని చూస్తున్నారా?. పార్టీని జోడెద్దుల మాదిరిగా నడపాల్సిన వాళ్లే అంబోతుల్లాగా సిగ్గు లేని వ్యవహారాలు చేస్తున్నారు. అసలు బీఆర్ఎస్ పార్టీకి నీతి, నియమం, ఒక విధానం అంటూ లేకుండా చేస్తున్నారు. ఒక పార్టీ తన విధానాలు చెప్పుకుంటూ ప్రజా పోరాటాలు చేసుకునే హక్కు లేదా? మేము ఉద్యమకారుల గురించి పోరాటం చేస్తే ఆ వార్తలు రాకుండా ఫోన్లు చేసి అడ్డుకున్నారు. అంటే మీరు ఉద్యమకారులకు అన్యాయం చేస్తే...మేము పోరాటం చేయటం మీకు సమస్యగా మారిందా?""అసలు బీఆర్ఎస్ పార్టీ అకౌంట్‌లో ఉన్న 14 వందల కోట్ల రూపాయలు క్విడ్ ప్రొ కో ద్వారా వచ్చినవి కావా? మీ పార్టీలో అకౌంట్‌లో ఉన్న డబ్బును అమరవీరుల కుటుంబాలకు కోటి చొప్పున పంచాలని డిమాండ్ చేస్తున్నా. ఒక ఆడబిడ్డ ఒంటరిగా ధైర్యంగా పోరాటం చేస్తే ఇన్ని కుట్రలు చేస్తారా? ప్రజల కోసం పోరాటం చేయాలంటే ప్రజాబలం, గుండె బలం ఉండాలి. దమ్ముంటే నాతో పాటు ప్రజా సమస్యల పోరాటం విషయంలో పోటీ పడండి. నేను మళ్లీ బీఆర్ఎస్ లోకి వెళ్తానంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ లో చేరేదే లేదు. ఫినిక్స్ సంస్థకు 80 వేల కోట్ల విలువైన భూములు కట్టబెట్టారు. వాడు ఆంధ్రావాడా? తెలంగాణ వాడా? ఆ సంస్థ వాడు 33 లక్షల టన్నుల కలప కొట్టేస్తున్నాడు. ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ పెట్టిన కేసులను కూడా మళ్లీ పట్టించుకోవటం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన భూమికి ఇంకా ఎక్కువగా ఈ ప్రభుత్వం కూడా భూమి ఇస్తోంది. అవినీతి విషయంలో బీఆర్ఎస్ కిటికీలు తెరిస్తే కాంగ్రెస్ తలుపులు తెరిచింది."కచ్చితంగా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వం అప్పన్నంగా అప్పగించిన భూములు అన్నింటిపైన రివ్యూ చేస్తామన్నారు. మొత్తం అవినీతిని కక్కిస్తామన్నారు. ఎవరినీ కూడా వదలిపెట్టబోమని చెప్పారు. ఈ రెండు పార్టీలకు అసలు ప్రజా అజెండా అనేదే లేదని మండిపడ్డారు. కేవలం దోచుకోవటం మీద దృష్టి ఉందని ఫైర్ అయ్యారు. "తెలంగాణ ఉద్యమం సమయంలో చిన్న కాంట్రాక్టర్లు, స్కూల్ యాజమాన్యాలు ఎంత ఖర్చు చేశారు. తెలంగాణ సాధించిన తర్వాత వారికి న్యాయం జరగాలని నేను బీఆర్ఎస్ లో ఉండి కొట్లాడాను. అప్పుడు కూడా ఉద్యమకారులు, కార్మికుల కోసం నేను ఫైట్ చేశాను. కార్మికులతో ఎవరున్నారో, కాంట్రాక్టర్లతో ఎవరున్నారో ప్రజలందరికీ తెలుసు. బీఆర్ఎస్‌లో ఉండి కూడా ఉద్యమకారుల కోసం వారి పక్షాన నిలబడ్డాను. కానీ వారికి అన్యాయం జరిగింది. అందుకే చాలా ఆవేదనతో చెబుతున్నా. బీఆర్ఎస్ పార్టీ అకౌంట్ లో ఉన్న డబ్బును అమరవీరుల కుటుంబాలకు పంచాలి.

# చైనాలో ఘోర అగ్నిప్రమాదం

మరికొందరు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. షూ రాజధానిగా పిలిచే జిన్‌జియాంగ్ నగరంలోని హుయిటెంగ్ షూస్ ఫ్యాక్టరీలో ఈ విషాదం చోటుచేసుకుంది. బహుళ అంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగలు అలుముకున్నాయి. భవనం పైకప్పుపై చిక్కుకున్న కొందరు కార్మికులు ప్రాణరక్షణ కోసం ఆర్తనాదాలు చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 200 మంది అగ్నిమాపక సిబ్బంది 35 అగ్నిమాపక యంత్రాలతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షూ తయారీలో వినియోగించే మండే స్వభావం కలిగిన ముడి పదార్థాల వల్లే మంటలు వేగంగా వ్యాపించినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ దుర్ఘటనపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదొక భారీ ప్రాణ నష్టమని ఆవేదన వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లో కాకరేపుతున్న వరంగల్ పంచాయితీ

పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.

### మహేష్ గౌడ్‌ను కలిసి మంత్రి సురేఖ

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై ఆగ్రహంతో ఉన్న మంత్రి కొండా సురేఖ పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కడియం శ్రీహరితో సమస్యగా ఉందని, తనకు ఇబ్బంది పెట్టేలా రాజకీయం చేస్తున్నాని మండిపడ్డారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన శాఖలో జోక్యం చేసుకొని అధికారులతో ఎలా సమీక్ష నిర్వహిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని వ్యక్తి ప్రోటోకాల్ పాటించుకుండా వ్యవహరించడం ఏంటని నిలదీశారు. క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రికి,, రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌కు లేఖ రాసినట్టు పేర్కొన్నారు.

### కడియం శ్రీహరి మొదటి నుంచి అంతే!

ఫిర్యాదు చేసిన తర్వాత మీడియాతో మాట్లాడిన మంత్రి కొండా సురేఖ కడియం శ్రీహరిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన వ్యక్తి వారిని మోసం చేసి కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. మొదటి నుంచి కూడా కడియం రాజకీయం ఇలానే ఉంటుందని ఆరోపించారు. తెలుగుదేశంలో ఆయనకు మిత్రులుగా ఉన్న వారి సహకారం కూడా ఉందని అందుకే ఇష్టం వచ్చినట్టు రెచ్చిపోతున్నారని తీవ్రమైన విమర్శలు చేశారు. గతంలో కీలక పదవుల్లో అధికార దర్పం వెలగబెట్టిన శ్రీహరి ఇప్పుడు సాధారణమైన ఎమ్మెల్యేగా ఉండలేకపోతున్నారని ఆరోపించారు.

### త్వరలోనే అన్నీ సర్దుకుంటాయి: మహేష్ గౌడ్

రగులుతున్న రాజకీయం త్వరలోనే సమసిపోతుందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. జరుగుతున్న పరిణామాలపై నేతలతో మాట్లాడుతున్నట్టు వెల్లడించారు. త్వరలోనే అన్ని పరిష్కారం అవుతాయని అన్నారు. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల ఇలాంటివి సర్వసాధారణంగా జరుగుతుంటాయని, అందర్ని పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగేలా ఎవరు వ్యవహరించినా సహించేది లేదన్నారు.

# బండి భగీరథ్‌కు భారీ ఊరట

చెప్పి తన పలు మార్లు అఘాయిత్యానికి పాల్పడినట్టు తల్లితో కలిసి ఆమె ఫిర్యాదు చేయడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు ఆమె వయసు నిర్ధారించుకున్న తర్వాత పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఇంతలో బండి భగీరథ్ కనిపించకుండా పోయారు. నాలుగు రోజుల హైడ్రామా తర్వాత పోలీసులు ఆయన్ని కూడా అరెస్టు చేశారు. వెంటనే కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి 45రోజుల పాటు రిమాండ్ ఖైదీగా భగీరథ్ ఉన్నారు. ఈ మధ్య పరీక్షలు ఉన్నాయని చెప్పి మధ్యంతర బెయిల్ తీసుకున్నారు.

వారం రోజుల పాటు ఇంట్లో ఉండి పరీక్షలు రాసిన తర్వాత కోర్టులో లొంగిపోయారు. ఈ కేసులో తనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టులో పిటిషన్ వేసుకున్నారు. దీనిపై నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. భగీరథ్ విద్యార్థి అని జైల్లో ఉండటం వల్ల చాలా ఆయన కెరీర్‌పై ఎఫెక్ట్ పడుతుందని వాదించారు. పరస్పర అంగీకారంతో జరిగిన విషయాలను కక్షపూరితంగా బహిర్గతం చేసి కేసులు పెట్టారని అన్నారు. దీనిపై పీపీ లాయర్లు తప్పుపట్టారు. ఆయనకు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని, ఆయన ఫ్యామిలీకి ఉన్న పలుకుబడిన ఉపయోగించి కేసును తప్పుదారి పట్టిస్తారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసు విచారణ కీలక దశకు చేరుకుందని అభియోగపత్రాలు దాఖలు చేస్తామని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో బెయిల్ మంజూరు చేస్తే కచ్చితంగా దర్యాప్తుపై ప్రభావం చూపుతుందన్నారు. అన్ని వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన తీర్పును రిజ్వర్ చేశారు. ఈ మధ్యాహ్నం తీర్పు వెల్లడించారు. బండి భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీని కోసం షరతులు విధించారు.

# అక్రమ రేషన్ బియ్యం మాఫియా మళ్లీ స్టార్ట్

- సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక దాడులకు స్థానికుల డిమాండ్
- డీఎస్పీ వెంకటేశం దాడుల తర్వాత తగ్గిన దందా
- ఇప్పుడు మళ్లీ పుంజుకున్న మాఫియా
- పోలీసుల నిర్లక్ష్యంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదన్న విమర్శలు






ఫైల్ ఫోటో

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో అక్రమ రేషన్ బియ్యం దందా మరోసారి తలెత్తుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళపల్లి (బొంగులూరు గేట్),ఇంజాపూర్, తుర్కయంజాల్, పెద్ద అంబర్పేట్, హయత్‌నగర్, చంపాపేట్, బడంగ్‌పేట్, అమంగల్, ప్రాంతాల్లో భారీ స్థాయిలో రేషన్ బియ్యం అక్రమ కొనుగోలు, నిల్వ, రవాణా జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రత్యేక సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ బృందాలు తక్షణమే దాడులు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ వెంకటేశం నేతృత్వంలో వరుస దాడులు నిర్వహించడంతో అక్రమ రేషన్ బియ్యం మాఫియా కొంతమేర వెనక్కి తగ్గిందని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఇదే తరహాలో పెద్ద అంబర్పేట్, మంగళపల్లి ఇతర ప్రాంతాల్లో డిఎస్పి వెంకటేశం అదికారిచే ప్రత్యేకనిగా ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. వందలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకోవడం, అక్రమ రవాణా వాహనాలను పట్టుకోవడం, మాఫియాపై కేసులు నమోదు చేయడం వల్ల అక్రమ దందాకు గట్టి దెబ్బ తగిలిందని చెబుతున్నారు. అయితే ఇటీవల అలాంటి దాడులు తగ్గిపోవడంతో మాఫియా మళ్లీ చురుకుగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా పేదలకు పంపిణీ చేయాల్సిన ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేసి, ఇతర రాష్ట్రాలకు లేదా ప్రైవేటు రైస్ మిల్లులకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ వ్యాపారం వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లడమే కాకుండా నిజమైన లబ్ధిదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ రేషన్ బియ్యం రవాణా జరుగుతున్నప్పటికీ స్థానిక స్థాయిలో నిఘా వ్యవస్థ ప్రభావవంతంగా పనిచేయడం లేదని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా సంబంధిత శాఖలతో పాటు స్థానిక పోలీసుల నిర్లక్ష్యం వల్లే మాఫియా ధైర్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిల్వ కేంద్రాలు, రవాణా మార్గాలపై రాత్రి సమయంలో నిరంతర నిఘా లేకపోవడంతో దందా యథేచ్ఛగా సాగుతోందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద అంబర్‌పేట్ నుంచి అమంగల్ వరకు, మంగళపల్లి బొంగులూరు గేట్ పరిసర ప్రాంతాల వరకు ప్రత్యేక సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ బృందాలు సమన్వయంతో ఆకస్మిక దాడులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, లేదా పిడి యాక్ట్ వెయ్యాలని, అక్రమ రవాణాకు వినియోగిస్తున్న గోదాములు, వాహనాలు, మధ్యవర్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో అక్రమ రేషన్ బియ్యం దందాను కట్టడి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే మాఫియా మళ్లీ తలెత్తిందని వారు విమర్శిస్తున్నారు. ప్రజాధనంతో కొనుగోలు చేసి పేదల కోసం కేటాయించిన రేషన్ బియ్యం అక్రమ మార్కెట్‌కు మళ్లిపోతే అది కేవలం చట్టవిరుద్ధ చర్య మాత్రమే కాదు, సామాజిక న్యాయానికి కూడా విఘాతం. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం, సివిల్ సప్లై శాఖ, టాస్క్‌ఫోర్స్, పోలీసు యంత్రాంగం సమన్వయంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమ రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని స్థానికులు, ప్రజాసంఘాలు గట్టిగా కోరుతున్నాయి.

# గ్రామ పంచాయతీ - సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో మూడేళ్ల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలి

## - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్అన్నారు. గ్రామ పంచాయతీ -సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో మెదక్ నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో లిజిల్లా కలెక్టర్లి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామ వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలిలి ప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రధాన సమస్యలను ప్రతి గ్రామ పంచాయతీ గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి గ్రామ పంచాయతీ రాబోయే మూడు సంవత్సరాల కాలానికి గ్రామ పంచాయతీ – సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (GPDP) ను రూపొందించుకోవాలని సూచించారు. ప్రణాళిక తయారీలో ప్రధానంగా ఏడు అంశాలపై వివిధ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించుకోవాలని తెలిపారు.

### - ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టిలి

ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. ఇంటి వద్దనే చెత్తను వేరు చేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్త సేకరణ సమయంలో తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, తదితరాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో పారవేయాలని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు.జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పనజీ రామ్ జీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల పని దినాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే గ్రామాల్లో మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే వీఓ భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి విద్యారావ్ జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ,డీపీఓ యాదయ్య,, మిషన్ భగీరథ ఈ.ఈ సంపత్ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# కియా యాజమాన్యంతో లోకేష్ సమావేశం

**విజయవాడ,** ఏపీకి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సియోల్‌లో ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం కియా మోటార్స్‌తో పాటు దక్షిణ కొరియా ప్రభుత్వ ఉన్నతాధికారులతో కీలక సమావేశాలు నిర్వహించారు. ఏపీని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చేందుకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు వ్యూహాత్మక ప్రతిపాదనలను వారి ముందు ఉంచారు.సియోల్‌లో కియా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) టే హన్ లీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందంతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా, అనంతపురంలో ఇప్పటికే విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కియా, రాష్ట్రంలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ముఖ్యంగా ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ), హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ప్రతిపాదించారు. కియా ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్న ప్లాట్‌ఫామ్ బియాండ్ వెహికల్ (పీబీవీ) వాహనాల ఉత్పత్తిని కూడా ఏపీలో చేపట్టాలని సూచించారు.అంతర్జాతీయ మార్కెట్లకు సులభంగా ఎగుమతులు చేసేందుకు వీలుగా విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ (కంప్లీట్లీ నాక్డ్ డౌన్) అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు, ఈ-జీఎంపీ ప్లాట్‌ఫామ్ కాంపోనెంట్లు, బ్యాటరీ సిస్టమ్‌లు, ఈవీ ఛార్జింగ్ ఎలక్ట్రానిక్స్ కోసం ఒక ఈవీ-కాంపోనెంట్ల తయారీ కేంద్రాన్ని, పవర్‌ట్రెయిన్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్ కోసం ఒక ఈవీ పవర్‌ట్రెయిన్ టెస్టింగ్ కేంద్రాన్ని కూడా స్థాపించాలని కోరారు.మంత్రి లోకేశ్ ప్రతిపాదనలపై కియా ప్రతినిధి టే హన్ లీ సానుకూలంగా స్పందించారు. 2017లో అనంతపురంలో అడుగుపెట్టి, 2019 నాటికి భారీ ఉత్పత్తి ప్రారంభించిన తీరును గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం తమ సంస్థ ఈవీ, అటానమస్ మొబిలిటీపై దృష్టి సారించిందని, లోకేశ్ చేసిన తాజా ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**కొరియన్ పెట్టుబడిదారులకు 3 భరోసా** అనంతరం మంత్రి లోకేశ్, దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా చుంగ్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న 3ఎ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో, తూర్పు తీరంలో సురక్షితమైన, నమ్మకమైన ప్రత్యామ్నాయంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని, దీనివల్ల అంతర్జాతీయ సరఫరా శృంఖల (సప్లయ్ చైన్) నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పన్ను రాయితీలు, తక్కువ ధరకే భూమి, సబ్సిడీలు పరిశ్రమలకు అండగా నిలుస్తాయని తెలిపారు.కొరియన్ సంస్థలు ఏపీకి రావడానికి ముందే, అక్కడి పని ప్రమాణాలు, భాష, సంస్కృతిపై స్థానిక యువతకు అవగాహన కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని లోకేశ్ తెలిపారు. దీనికోసం దక్షిణ కొరియాతో కలిసి సంయుక్త శిక్షణా అకాడమీలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖలు సంసిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక బంధాన్ని బలోపేతం చేసేందుకు ఏపీలో ఒక కొరియన్ కల్చరల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.భారత్‌లోనే రెండో అతి పొడవైన తీరప్రాంతం, విశాఖపట్నం, కృష్ణపట్నం వంటి ప్రధాన ఓడరేవులు, కొత్తగా రాబోయే నాలుగు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల వల్ల ఏపీ తక్కువ ఖర్చుతో ఎగుమతులకు లాంచ్‌ప్యాడ్‌గా మారుతుందని లోకేశ్ వివరించారు. భారత్-కొరియా వ్యూహాత్మక భాగస్వామ్యానికి అనుబంధంగా ఒక ప్రత్యేకమైన 'ఆంధ్రప్రదేశ్-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్' ఏర్పాటు చేయాలని, ఇరు ప్రాంతాల మధ్య వార్షిక ఆర్థిక భాగస్వామ్య చర్చలకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. వాణిజ్య సంబంధాలను మరింత పటిష్ఠం చేయడానికి విశాఖపట్నం-బుసాన్/ఇంచియాన్ నగరాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం, ఏపీలోని యూనివర్సిటీల్లో కొరియన్ భాషా కేంద్రాలు, డైరెక్ట్ ఎయిర్ కనెక్టివిటీకి చొరవ చూపాలని కోరారు

## మతం మారడం
# ఇష్టం లేక ఆత్మహత్య

**హైదరాబాద్,** ఆర్థిక వివాదాలు, మతం మారాలంటూ పొరుగువారి నుంచి ఎదురైన తీవ్ర ఒత్తిడి కారణంగా ఓ దంపతులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. వరంగల్ జిల్లాకు చెందిన ఈ జంట, తమ ఇద్దరు చిన్నారులను అనాథలను చేస్తూ జూలై 2న ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ప్రాణాలు వదిలారు. క్రైస్తవ మతంలోకి మారాలని పొరుగువారు తమ తల్లిదండ్రులను బలవంతం చేశారని, ఆ వేధింపులే వారి ఆత్మహత్యకు దారితీశాయని వారి 14 ఏళ్ల కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడం సంచలనం సృష్టిస్తోంది.వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేటకు చెందిన రవికుమార్, శిరీష దంపతులు జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలసు వచ్చి, హయత్‌నగర్ పరిధిలోని కుంట్లూరులో నివాసం ఉంటున్నారు. బియ్యం వ్యాపారం చేసే రవికుమార్‌కు పొరుగున ఉండే వెంకట్, ప్రమిలతో పరిచయం ఏర్పడింది. రెడీమిక్స్ కాంక్రీట్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే నెలకు రూ.20,000 ఆదాయం వస్తుందని వారు నమ్మించారు. వారి మాటలు నమ్మిన రవికుమార్, తన భార్య బంగారు నగలను తాకట్టు పెట్టి సుమారు రూ.20 లక్షల వరకు వారికి అందజేశారు.అయితే, నిందితులు కేవలం రెండు మూడు నెలలు మాత్రమే నగదు చెల్లించి, ఆ తర్వాత నిలిపివేశారు. దీంతో అప్పులకు వడ్డీలు పెరిగిపోవడం, పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోవడంతో రవికుమార్ దంపతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. ఇదే సమయంలో మతం మార్చుకోవాలంటూ వెంకట్, ప్రమిల తమపై ఒత్తిడి తెచ్చారని, చర్చికి రావాలని నిరంతరం వేధించేవారని వారి కుమారుడు సుశాంత్ పోలీసులకు తెలిపాడు. ఈ వేధింపులు భరించలేక వారు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవడానికి కూడా సిద్ధపడ్డారు.జూలై 2న ఆత్మహత్యకు పాల్పడకముందు రవికుమార్ దంపతులు వెంకట్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు కాల్ డేటా రికార్డులు ద్వారా స్పష్టమవుతోంది. ఘటనానంతరం పరారైన వెంకట్, ప్రమిలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, వారు తమపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన సికింద్రాబాద్ రైల్వే పోలీసులు, తదుపరి విచారణలో భాగంగా దానిని ఆత్మహత్యకు ప్రేరేపణ (సెక్షన్ 108) కింద మార్చి దర్యాప్తు చేపట్టారు. మత మార్పిడి ఆరోపణలపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదని, అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను వరంగల్‌లోని బంధువుల వద్దకు చేర్చారు.

# కాక రేపుతున్న కడియం, కొండా వివాదం

**వరంగల్,** తెలంగాణలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లా స్థాయి నాయకుల మధ్య సమన్వయం లోపం పెను దుమారం రేపుతూనే ఉంది. ఇప్పటికే ఇలాంటి పంచాయితీలు భరించలేని నాయకులు తమ దారి తాము చూసుకున్నారు. మరికొందరు సైలెంట్ అయిపోయారు. ఇప్పుడు తాజాగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కడియం శ్రీహరి, మంత్రి కొండ సురేఖ మధ్య వివాదం తలెత్తింది. తన శాఖలో విషయాలపై తన శాఖ కమిషనర్‌తో కడియం శ్రీహరి ఎలా సమీక్ష జరుపుతారని కొండా సురేఖ నిలదీస్తున్నారు. కచ్చితంగా ఇది ఆయన అహంకారనికి నిదర్శనమని అంటున్నారు. అయితే ఇది అవగాహన లోపం కారణంగానే జరిగిందని కడియం శ్రీహరి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఈ వివాదాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సురేఖ, తాజాగా పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.

**మహేష్ గౌడ్‌ను కలిసి మంత్రి సురేఖ** ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై ఆగ్రహంతో ఉన్న మంత్రి కొండా సురేఖ పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కడియం శ్రీహరితో సమస్యగా ఉందని, తనకు ఇబ్బంది పెట్టేలా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన శాఖలో జోక్యం చేసుకొని అధికారులతో ఎలా సమీక్ష నిర్వహిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని వ్యక్తి ప్రోటోకాల్ పాటించుకుండా వ్యవహరించడం ఏంటని నిలదీశారు. క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రికి,, రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌కు లేఖ రాసినట్టు పేర్కొన్నారు.ఫిర్యాదు చేసిన తర్వాత మీడియాతో మాట్లాడిన మంత్రి కొండా సురేఖ... కడియం శ్రీహరిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన వ్యక్తి వారిని మోసం చేసి కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. మొదటి నుంచి కూడా కడియం రాజకీయం ఇలానే ఉంటుందని ఆరోపించారు. తెలుగుదేశంలో ఆయనకు మిత్రులుగా ఉన్న వారి సహకారం కూడా ఉందని అందుకే ఇష్టం వచ్చినట్టు రెచ్చిపోతున్నారని తీవ్రమైన విమర్శలు చేశారు. గతంలో కీలక పదవుల్లో అధికార దర్పం వెలగబెట్టిన శ్రీహరి ఇప్పుడు సాధారణమైన ఎమ్మెల్యేగా ఉండలేకపోతున్నారని ఆరోపించారు.

త్వరలోనే అన్నీ సర్దుకుంటాయి: మహేష్ గౌడ్ రగులుతున్న రాజకీయం త్వరలోనే సమసిపోతుందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. జరుగుతున్న పరిణామాలపై నేతలతో మాట్లాడుతున్నట్టు వెల్లడించారు. త్వరలోనే అన్ని పరిష్కారం అవుతాయని అన్నారు. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల ఇలాంటివి సర్వసాధారణంగా జరుగుతుంటాయని, అందర్ని పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగేలా ఎవరు వ్యవహరించినా సహించేది లేదన్నారు.

# నా లవర్‌ను పెళ్లి చేసుకోవద్దంటూ పోస్టర్లు

**కరీంనగర్,** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి గ్రామంలో వెలసిన కొన్ని పోస్టర్లు స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించాయి. ఒక యువతి, యువకుడి మధ్య గల ప్రేమ వ్యవహారానికి సంబంధించిన ఈ పోస్టర్లు వివాదాస్పదం కావడంతో, బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.గ్రామానికి చెందిన ఓ యువతితో తాను గత ఏడేళ్లుగా ప్రేమలో ఉన్నానని సదరు యువకుడు ఆ పోస్టర్లు ద్వారా పేర్కొన్నాడు. తమ ప్రేమ విషయం తెలిసినప్పటికీ, ఆమె తల్లిదండ్రులు బలవంతంగా వేరొకరితో వివాహం నిశ్చయించారని ఆరోపించాడు. అంతేకాకుండా, తమ ప్రేమ వ్యవహారం గురించి కాబోయే వరుడికి చెప్పినప్పటికీ, అతడు 16 తులాల బంగారం తీసుకుని ఈ పెళ్లికి అంగీకరించాడని ఆ యువకుడు ఆరోపణలు గుప్పించాడు.యువకుడు, యువతితో పాటు కాబోయే వరుడి ఫోటోలతో కూడిన ఈ పోస్టర్లను గ్రామ కూడళ్లు, గోడలపై అంటించడంతో అవి గ్రామస్థుల దృష్టిని ఆకర్షించాయి. ఈ విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోస్టర్లలో పేర్కొన్న ఆరోపణల వాస్తవికతపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# భూ వివాదాలు లేకుండా చేస్తాం

భూ వివాద రహిత ఏపీనే లక్ష్యం.. గత పాలకుల పాపాలకు ప్రక్షాళన: సీఎం చంద్రబాబు రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, ఆంధ్రప్రదేశ్‌ను భూవివాద రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుల అరాచకాలు, పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయని, వారి నల్ల చట్టాలను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తున్నామని ఆయన అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించిన 'మీ భూమి- మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లను పంపిణీ చేసి ప్రజావేదిక సభలో ప్రసంగించారు.గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఒక నల్ల చట్టమని, ప్రజల ఆస్తులను కాజేసేందుకు, వారిలో భయాందోళనలు సృష్టించేందుకే దానిని తెచ్చారని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామని గుర్తుచేశారు. "గత పాలకులు తమకు నచ్చని వారిని భయపెట్టేందుకు వారి భూములను 22ఏ జాబితాలో పెట్టేశారు. వివాదాలు సృష్టించి భూములు లాక్కోవాలని చూశారు. భూమి పత్రాలపై, చివరికి సర్వే రాళ్లపై కూడా వారి ఫొటోలు వేసుకున్నారు. ఆ ఫొటోల పిచ్చిని రద్దు చేసి, ఇప్పుడు రాష్ట్ర రాజముద్రతో, పటిష్ఠమైన భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు అందిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. ఈ పంపిణీని ఒక పవిత్ర ఉద్యమంగా చేపడుతున్నామని, 2027 మార్చి నాటికి రాష్ట్రంలోని 9,833 గ్రామాల్లో 72,70,605 పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తామని తెలిపారు.భూ సమస్యల పరిష్కారంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. తిరుపతి, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో ఏళ్లుగా నలుగుతున్న భూ వివాదాలను పరిష్కరించామని తెలిపారు. డోన్ నియోజకవర్గంలో 2,074 ఎకరాల వక్ఫ్ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి రైతులకు న్యాయం చేశామని చెప్పారు. ఆటో మ్యుటేషన్ ద్వారా వారసత్వ ఆస్తులను సులభంగా బదిలీ చేసే ప్రక్రియను అమలు చేస్తున్నామన్నారు.రాయలసీమ ముఖచిత్రాన్ని మారుస్తున్నామని, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్, ఆమ్కా డిఫెన్స్ ఫైటర్ జెట్ ప్లాంట్ (స్టెల్త్ యుద్ధ విమానం) వంటి భారీ పరిశ్రమలు వస్తున్నాయని, ఇక్కడ తయారైన ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌లు దేశమంతా తిరుగుతాయని అన్నారు. రూ.40 వేల కోట్ల ప్రభుత్వ, రూ.60 వేల కోట్ల ప్రైవేట్ పెట్టుబడులతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో 22 శాతం వర్షపాతం తక్కువగా నమోదైందని, ఈ నేపథ్యంలో నీటి భద్రత కోసం 'జలధార' కార్యక్రమాన్ని ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవడం ద్వారానే నీటి భద్రత సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ దిశగా 18 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, చెక్‌డ్యామ్‌లు నిర్మించిన నంద్యాల జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు.

# కారుణ్య నియామకాలపై సర్కార్ క్లారిటీ

**విజయవాడ,** ఆంధ్రప్రదేశ్‌లో నిష్క్రియాత్మక కారుణ్య మరణం (ప్యాసివ్ యూథనేషియా) అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. కోలుకునే అవకాశం లేని వ్యాధులతో బాధపడుతున్న రోగులకు జీవనాధార వ్యవస్థలను ఉపసంహరించుకోవడానికి వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ జులై 8న ఈ విధివిధానాలకు అధికారికంగా ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన 'గౌరవప్రదంగా మరణించే హక్కు'కు అనుగుణంగా ఈ నిబంధనలను రూపొందించారు. ప్యాసివ్ యూథనేషియా అంటే కోలుకోలేని స్థితిలో ఉన్న రోగులకు వెంటిలేటర్లు, ఫీడింగ్ ట్యూబ్‌లు వంటి కృత్రిమ వైద్య సహాయాన్ని నిలిపివేసి, వారు సహజంగా మరణించేందుకు అనుమతించడం. ఇది భారతదేశంలో నిషేధించబడిన 'యాక్టివ్ యూథనేషియా'కు భిన్నమైనది. సుప్రీంకోర్టు 2018లో 'కామన్ కాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో చారిత్రాత్మక తీర్పునిస్తూ ప్యాసివ్ యూథనేషియాకు అనుమతించినప్పటికీ, రాష్ట్ర స్థాయిలో స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఇప్పటివరకు అనిశ్చితి నెలకొంది.ఈ కొత్త నిబంధనల ప్రకారం, స్పృహలో ఉన్న ఏ వ్యక్తి అయినా 'అడ్వాన్స్ డైరెక్టివ్' (ముందస్తు వీలునామా) రాసుకోవచ్చు. దీని ద్వారా భవిష్యత్తులో తనకు ఎలాంటి చికిత్స అందించాలో లేదా నిలిపివేయాలో ముందుగానే నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. ఇద్దరు సాక్షుల సమక్షంలో నోటరీ లేదా గెజిటెడ్ అధికారి ద్వారా ఈ పత్రాన్ని ధృవీకరించుకోవాలి.ఒకవేళ రోగి పరిస్థితి విషమించి, చికిత్స ఫలించదని భావిస్తే సంబంధిత ఆసుపత్రి ఒక 'ప్రైమరీ మెడికల్ బోర్డు'ను ఏర్పాటు చేయాలి. ఈ బోర్డు 48 గంటల్లోగా తన నివేదికను సమర్పిస్తుంది. వారి సిఫార్సుల అనంతరం, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) నేతృత్వంలోని 'సెకండరీ మెడికల్ బోర్డు' తుది నిర్ణయం తీసుకుంటుంది. కుటుంబ సభ్యుల అంగీకారం, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌కు సమాచారం అందించిన తర్వాతే వైద్య సహాయాన్ని నిలిపివేస్తారు. ఈ నిబంధనల అమలును డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ సహా ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. తాజా మార్గదర్శకాల వల్ల రోగుల కుటుంబాలపై మానసిక, ఆర్థిక భారం తగ్గడంతో పాటు, వైద్యులకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో

# అంగరంగ అక్షరాభ్యాసం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానంలో నేడు నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం భక్తుల విశేష ఆదరణ మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. విద్యారంభానికి అత్యంత శుభప్రదమైన ఈ కార్యక్రమంలో వందలాది మంది చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలిసి పాల్గొని శ్రీకాళహస్తీశ్వరస్వామి, శ్రీ జ్ఞానప్రసూనాంబిక అమ్మవార్ల దివ్య ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి ఆశీర్వదించారు. విద్యారంభాన్ని దైవసన్నిధిలో ప్రారంభించడం భారతీయ సంస్కృతిలో విశిష్టమైన సంప్రదాయమని, చిన్నారుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.కె. వెంకటేశులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వహించే సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు కె. వైశాలి, కె . నాగరాజు, జి . గోపీనాథ్, డి. లక్ష్మమ్మ ప్రత్యేక ఆహ్వానితులు సి. శైలజ, ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి ఎన్.ఆర్. కృష్ణారెడ్డి ,ఏ ఈ ఓ హేమమాలిని , పర్యవేక్షకులు హరి , ఆలయ ఏ ఈ ఓ విద్యాసాగర్ రెడ్డి , ఆలయ పర్యవేక్షకులు సి. నాగభూషణం యాదవ్ , టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి , ప్రోటోకాల్ ఏ ఈ ఓ లోకేష్ బాబు , అనుబంధ ఆలయాల ఛైర్మన్ లు బోర్డు సభ్యులు మరియు తెలుగు దేశం పార్టీ నాయకులు , దేవస్థానం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు దేవస్థానం కల్పించిన ఏర్పాట్లపై హర్షం వ్యక్తం చేస్తూ, చిన్నారులకు దైవసన్నిధిలో అక్షరాభ్యాసం నిర్వహించే అవకాశం కల్పించిన దేవస్థానానికి కృతజ్ఞతలు తెలిపారు.

## కోర్టు స్టే అండతో నడుస్తున్న రెజోనెన్స్ స్కూల్

**అనుమతులు లేకున్నా విద్యార్థులతో తరగతులు**

**డీఈఓ, ఆర్జేడీ ఈ నోటీసులు బేఖాతరు, అధికారుల ఆదేశాలకు విలువ లేదా.?**

**విద్యార్థుల జీవితాలతో గెలగాటం ఆడుతున్న రిజోనెన్స్ స్కూల్ యాజమాన్యం**

**పారిశ్రామిక వార్డలో అనుమతులు లేకుండా స్కూలు నిర్వహణ**

**స్కూలును వెంటనే తొలగించి యజమాన్యంపై కేసు నమోదు చేయాలని ఫైర్ బ్రాండ్ జర్నలిస్టుల విన్నపం**




నాచారం (ప్రశ్న న్యూస్) నాచారం పారిశ్రామిక వాడలో ప్రభుత్వ అనుమతులు లేకుండానే కార్పొరేట్ విద్యాసంస్థ పేరుతో రెజోనెన్స్ పాఠశాల నిర్వహణ కొనసాగుతుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ అనుమతులు లేకుండా పాఠశాలను నడిపిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న యాజమాన్యం, అధికారుల చర్యలను అడ్డుకునేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే ఆర్డర్ తెచ్చుకుందన్న ప్రచారం విద్యావర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. అధికారిక సమాచారం ప్రకారం, రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్జేడీ ఈ) సంబంధిత వ్యవహారంపై స్పీకింగ్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా, పారిశ్రామిక ప్రాంతంలో విద్యాసంస్థ నిర్వహణకు అవసరమైన అనుమతులు లేవని కూడా స్పష్టంగా పేర్కొన్నట్లు సమాచారం. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), ఆర్జేడీ ఈ కార్యాలయాలు పాఠశాలను వెంటనే మూసివేయాలని నోటీసులు జారీ చేసినప్పటికీ, యాజమాన్యం వాటిని లెక్కచేయకుండా యథావిధిగా తరగతులు కొనసాగించడం అధికార వ్యవస్థనే సవాల్ చేస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను పక్కనబెట్టి కార్పొరేట్ విద్యాసంస్థ పేరుతో పాఠశాల నిర్వహించడమే కాకుండా అధికారులను కోర్టుల వరకు లాగేంత రాజకీయ పలుకుబడి ఎవరి అండతో లభించిందనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. చట్టం ముందు అందరూ సమానమే అయితే ఒక విద్యాసంస్థ మాత్రం నోటీసులను బేఖాతరు చేస్తూ ఎలా కొనసాగుతోందని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే ఈ అక్రమాలపై ప్రశ్నిస్తున్న జర్నలిస్టులు ను సైతం యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడం చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రయోజన అంశాలను వెలుగులోకి తీసుకువస్తున్న విలేకరులను భయపెట్టే ప్రయత్నాలు అత్యంత ఖండనీయమని జర్నలిస్టు సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ, జిల్లా యంత్రాంగం ఈ వ్యవహారాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి, కోర్టు ముందు పూర్తి ఆధారాలను సమర్పించి స్టేను రద్దు చేయించేందుకు చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేని పాఠశాలను వెంటనే మూసివేసి, నిబంధనలను ఉల్లంఘించిన యాజమాన్యంపై తగిన చట్టపరమైన కేసులు నమోదు చేయాలని ఫైర్‌బ్రాండ్ రిపోర్టర్లు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు రాజకీయాలు, పలుకుబడులు, న్యాయపోరాటాల మధ్య బలికాకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని న్యాయం చేయాల్సిన అవసరం ఉందని ఫైర్ బ్రాండ్ జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు.

## ఎంపీ వద్దిరాజు డిమాండ్

**- గోదావరి జలాలు సముద్రం పాలు కాకుండా పంట పొలాలకు మళ్లించాలి**

గోదావరి జలాలు వృథాగా సముద్రం పాలు కాకుండా సద్వినియోగంలోకి తేవాల్సిన గురుతర బాధ్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్మరించడం బాధాకరమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాలలో విస్తారంగా కురిసిన వర్షాల వల్ల గోదావరి నదిలోకి వరద పోటెత్తి మేడిగడ్డ వద్ద ప్రస్తుతం 90 క్యూసెక్కులు ప్రవాహం కొనసాగుతున్నదని తెలిపారు. ఈ నీళ్లు కిందకు వృథాగా వెళ్లి బంగాళాఖాతం పాలవ్వకుండా కన్నేపల్లి పంపుల ద్వారా అన్నారం,సుందిళ్ల,రంగనాయక సాగర్,కొండపోచమ్మ రిజర్వాయర్లను నింపేయకపోవడం విచారకరమన్నారు. ఎంపీ రవిచంద్ర హైదరాబాద్ తెలంగాణ భవన్ లో బుధవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, బీఆర్ఎస్ పట్ల రేవంత్ రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నీళ్లను కిందకు వదిలేసి గురుదక్షిణ చెల్లించడానికే రేవంత్ రెడ్డి పూనుకున్నారే తప్ప రైతులు,రాష్ట్ర ప్రయోజనాలపై ఏ మాత్రం పట్టింపులేదని ఎంపీ రవిచంద్ర విమర్శించారు.

ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది కరువు దాపురిస్తుందని తెలిసి కూడా గోదావరి జలాలను ఎత్తిపోసి సద్వినియోగం చేసుకోకుండా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉందన్నారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం బహుళ దశ సాగునీటి పథకంతో రాష్ట్రంలోని సగభాగం సస్యశ్యామలంగా మారిందని, కాంగ్రెస్ పాలనలో భూములు బీడు వారుతున్నాయని ఎంపీ చెప్పారు.

# రైతు సంక్షేమమే మా లక్ష్యం

- సర్పంచ్ కాకులమర్రి శ్రీలత
- ఏటూరునాగారం పరిధి రైతులకు కీలక హెచ్చరిక: ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.
- రైతు గుర్తింపు కార్డు లేకపోతే ప్రభుత్వ పథకాలు, రాయితీలు నిలిచిపోయే ప్రమాదం.
- ఆధార్, పాస్ బుక్ తో ఉదయం 10గంటలకు రైతు వేదికకు రావాలని సర్పంచ్ సూచన.
- 6 గ్రామాల రైతులకు అలర్ట్: పంట సాగు వివరాలు నమోదు చేసుకోకపోతే సబ్సిడీలు ఆగిపోతాయి
- ప్రతి ఒక్కరూ వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని విజ్ఞప్తి




ఏటూరునాగారం(ప్రశ్న న్యూస్) ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలంటే రైతులందరూ వెంటనే "ఫార్మర్ రిజిస్ట్రేషన్" అంటే రైతు గుర్తింపు కార్డు నమోదు చేసుకోవాలని ఏటూరునాగారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత తెలిపారు. ఏటూరునాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆకులవారి ఘనపూర్, మానసపల్లె, మేడారం, ఏటూరునాగారం, పాపకాపూర్ మరియు రామన్నగూడెం రెవిన్యూ గ్రామాల్లో పట్టా భూమి కలిగిన రైతులందరికీ ఈ సూచన వర్తిస్తుందని ఆమె పేర్కొన్నారు.

**రైతు గుర్తింపు కార్డు లేనిదే ప్రభుత్వ లబ్ధి లేదు.**

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, రాయితీలు మరియు ఇతర వ్యవసాయ సంబంధిత ప్రయోజనాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాల్సిందే. రిజిస్ట్రేషన్ చేయని రైతులు అన్ని పథకాలకు అనర్హులు అవుతారు.

**రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే సబ్సిడీలు ఆగిపోతాయి.**

పంట సాగు వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు కాకపోవడం వల్ల భవిష్యత్తులో వచ్చే విత్తన సబ్సిడీలు, ఎరువుల రాయితీలు, బీమా సౌకర్యాలు నిలిచిపోయే అవకాశం ఉంది.

**ప్రభుత్వ రికార్డుల్లో పేరు లేకపోతే ఇబ్బందులు.**

రిజిస్ట్రేషన్ చేయకపోతే ప్రభుత్వ రికార్డుల్లో రైతు వివరాలు ఉండవు. దీంతో భవిష్యత్తులో ఏదైనా సహాయం కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

**తీసుకురావాల్సిన పత్రాలు ఇవే.**

**రిజిస్ట్రేషన్ ప్రక్రియకు రైతులు ఈ పత్రాలతో రావాలి:**

1. ఆధార్ కార్డ్ జిరాక్స్
2. పట్టా పాస్ బుక్ జిరాక్స్
3. ఆధార్ తో లింక్ అయిన మొబైల్ నంబర్ ఉన్న ఫోన్

రైతు వేదికలో ఉదయం 10 గంటల నుంచి ప్రక్రియ.

ఏటూరునాగారంలోని రైతు వేదిక వద్ద ఉదయం 10 గంటల నుంచి ఫార్మర్ రిజిస్ట్రేషన్ జరుగుతుంది. పై 6 గ్రామాల రైతులందరూ ఆలస్యం చేయకుండా వెంటనే వచ్చి నమోదు చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

**సర్పంచ్ విజ్ఞప్తి**

ఒక్క రైతు సోదరుడు కూడా ఈ అవకాశాన్ని కోల్పోవద్దు. రైతు సంక్షేమే మా లక్ష్యం. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి" అని సర్పంచ్ కాకులమర్రి శ్రీలత విజ్ఞప్తి చేశారు.

## ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ కంపెనీ మాకొద్దు

# మా ప్రాణాలే మాకు ముద్దు

**వంటేరు ప్రతాప్‌రెడ్డి**



గజ్వేల్ ( ప్రశ్నా న్యూస్ ) రంగయ్యపల్లి, చెట్ల గౌరారం గ్రామాల ప్రజలకు శాపంగా మారిన ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ కంపెనీని వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. కంపెనీ తొలగింపు కోసం ఆదివారం ప్రజల పక్షాన నిరాహార దీక్ష చేపడతామని ప్రకటించారు. రంగయ్యపల్లి గ్రామంలో ప్రజలను కలిసి మాట్లాడిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామస్తులు ముక్తకంఠంతో "ఎంఎస్ అగర్వాల్ కంపెనీ మాకొద్దు... మా పిల్లలు, మా ప్రాణాలే మాకు ముద్దు" అంటూ తమ ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని, దాదాపు 20 సంవత్సరాలుగా బూడిద, కాలుష్య ప్రభావంతో అనేక మంది మృతి చెందారని, వేలాది మంది చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని ఆరోపించారు. భూగర్భ జలాలు కలుషితమై తాగునీటికి, వ్యవసాయానికి అనువుగా లేకుండా పోయాయని పేర్కొన్నారు. రాత్రింబవళ్లు కంపెనీ కార్యకలాపాలు కొనసాగడంతో భారీ శబ్ద కాలుష్యం ఏర్పడి విద్యార్థులు చదువుకోలేని, ప్రజలు ప్రశాంతంగా నిద్రపోలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. కంపెనీలో మరణాలు జరిగినా వాటిని గుట్టుచప్పుడు కాకుండా ఉంచుతున్నారని, సంబంధిత శాఖలతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్థానికులకు ఉపాధి కల్పించకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని నియమిస్తున్నారని, కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రెండు గ్రామాల ప్రజలపై అక్రమ కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్ సమక్షంలో తప్పుడు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి కంపెనీ అనుమతులను రద్దు చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకపై ఎలాంటి బెదిరింపులకు భయపడబోమని, రంగయ్యపల్లి, చెట్ల గౌరారం గ్రామాల ప్రజల తరపున ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ కంపెనీ తొలగించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, పిల్లల భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు. ఈ అంశంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించామని, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. కంపెనీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ప్రజలతో కలిసి నిరాహార దీక్ష చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు

## ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్స్ ఉద్యోగులకు

# జీతాలు పెంచి, తక్షణమే చెల్లించాలి : టియుసిఐ





ఓయూ (ప్రశ్న న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్స్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు 2022 నుంచి వీడిఏ అమలు చేయడం లేదు. కనీస వేతనాలను అమలు చేయడం యూనివర్సిటీ బాధ్యత. కానీ ఇంతవరకు అమలు చేయకుండా హాస్టల్స్ ఉద్యోగులకు యూనివర్సిటీ అధికారులు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. టియుసిఐ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ అనేక దఫాలుగా వైస్ ఛాన్స్ లర్, రిజిస్ట్రార్, చీఫ్ వార్డెన్ లకు వినతి పత్రాలు ఇచ్చింది. ఫలితము రాలేదు. ఈ విషయంపై యూనియన్ ఆధ్వర్యంలో జాయింట్ లేబర్ కమిషనర్ జంట నగరాలకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుని అందుకొని జాయింట్ లేబర్ కమిషనర్ ఎనిమిది నెలల పాటు చర్చలు యూనివర్సిటీకి ,యూనియన్ కి మధ్య జరిగాయి. ఐదు రోజుల కిందట యూనివర్సిటీ రిజిస్ట్రార్ కి, కాంట్రాక్ట్ లేబర్ చట్టం ప్రకారం, యూనివర్సిటీ చేసుకున్న ఒప్పందం ప్రకారం, కనీస వేతనాలను అమలు చేయాలని, ఏరియర్స్ ఇవ్వాలని, కార్మిక ప్రయోజన చట్టబద్ధ హక్కులన్నీ కల్పించాలని, ఓవర్ టైం వేతనాన్ని పని గంటలు ఎక్కువ చేసిన ఉద్యోగులకి ఇవ్వాలని, వీక్లీ ఆఫ్ అమలు చేయాలని, నేషనల్ ఫెస్టివల్ హాలిడేస్ తో పాటు, 20 రోజులకు ఒక క్యాజువల్ లీవ్ లు అమలు చేయాలని, అన్ని రకాల రిజిస్టర్లను అందుబాటులో ఉంచాలని లేఖ రాశారు. గురువారం నాడు రిజిస్ట్రార్ కి, వైస్ ఛాన్స్ లర్ కి యూనియన్ ఆధ్వర్యంలో జాయింట్ లేబర్ కమిషనర్ ఇచ్చిన ఆర్డర్ ను అమలు చేయాలని కుక్స్ కి రూ.19,502, అసిస్టెంట్ కుక్స్ కి రూ.17,757, హౌస్ కీపింగ్, స్కావెంజర్ ఇతర సెక్టార్ ఉద్యోగులకు రూ.15,793 రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ లేఖ ఇచ్చారు. ముఖ్యమంత్రి ప్రకటించిన ప్రకారంగా నేటి వరకు కాంట్రాక్టు లెక్చరర్లకు, హాస్టల్ ఉద్యోగులకు ఎవరికి కూడా వేతనాలు చెల్లించ లేదు. ముఖ్యమంత్రి ప్రకటనను అత్యున్నత విద్యా సంస్థ అయిన యూనివర్సిటీ ఉల్లంఘించడం తీవ్రమైన తప్పిదమని టియుసిఐ తెలుపుతుంది. పైన పేర్కొన్న డిమాండ్స్ పై స్పందించకుంటే సమ్మెకు కూడా వెనుకాడబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎల్ పద్మ, ఓయు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె ఎస్ ప్రదీప్, శివాజీ, లక్ష్మి, వెంకటేష్, సారయ్య, సత్యం పాల్గొన్నారు.

## గజ్వేల్ శ్రీ మహంకాళి దేవాలయంలో బోనాల ఉత్సవాల నిర్వహణపై సమీక్ష



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీ మహంకాళి దేవాలయంలో రానున్న బోనాల ఉత్సవాల నిర్వహణపై ధర్మకర్తల మండలి, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, ఆలయ కార్యవర్గ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కాల్వ శ్రీధర్ రావు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, మమత, గోలి సంతోష్, బొగ్గుల సురేష్, స్వప్న, కళ్యాణ్ కార్ , పద్మా బాయి నర్సింగ్ రావు, మామిడి శ్రీధర్, ధర్మకర్తలు మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి గుప్తా, కొమురవెల్లి శేఖర్, కైలాస ప్రభాకర్, కళ్యాణ్ కార్ లింగోజి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్న గజ్వేల్ శ్రీ మహంకాళి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అలాగే బోనాల ఉత్సవాలను విజయవంతం చేయడానికి భక్తులు, ధర్మకర్తలు, శాశ్వత సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు అందరూ సమిష్టిగా సహకరించాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కైలాస ప్రభాకర్ సేట్, దూబకుంట ప్రభాకర్ సేట్, కొమురవెల్లి శేఖర్ సేట్‌లు ఆలయానికి ఒక్కొక్కరు 100 గ్రాముల వెండి విరాళంగా అందజేసి తమ భక్తిని చాటుకున్నారు.

### బాక్సాఫీస్ వసూళ్లు ఫేక్.. 'క' సినిమా కలెక్షన్లపై

# నిర్మాత షాకింగ్ కామెంట్స్!



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కెరీర్‌లోనే భారీ విజయాన్ని అందుకున్న పీరియాడిక్ సస్పెన్స్ థ్రిల్లర్ 'క' (ఖా) బాక్సాఫీస్ వసూళ్లపై ఇప్పుడు సరికొత్త వివాదం చేలరేగింది. ఈ సినిమా సాధించినట్లు చెబుతున్న వసూళ్లు 99 శాతం అవాస్తవమంటూ సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం జరుగుతున్న తరుణంలో.. చిత్ర నిర్మాత స్వయంగా చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి మరింత నెయ్యి పోశాయి.ఇటీవల హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటించిన 'రావు బహదూర్' చిత్ర సక్సెస్ మీట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన 'క' చిత్ర నిర్మాత చింతా గోపాలకృష్ణ రెడ్డి మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ క్రమంలోనే 'క' సినిమా కలెక్షన్ల ప్రస్తావన రాగా ఆయన స్పందిస్తూ.. ఈ చిత్రానికి బాక్సాఫీస్ పరంగా పెద్దగా వసూళ్లేమీ రాలేదన్నట్లుగా మాట్లాడారు. "ఆ సినిమా వల్ల చివరకు మిగిలింది ఏంటంటే.. కేవలం ఆ చిత్రంలో నటించిన ఆర్టిస్టుల భవిష్యత్తు మాత్రమే" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.నిర్మాత నోటి నుంచే ఈ మాటలు రావడంతో నెటిజన్లు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు. 'క' సినిమాకు థియేట్రికల్‌గా అసలు లాభాలే రాలేదని, నిర్మాతలకు బాక్సాఫీస్ వద్ద రూపాయి కూడా మిగలలేదని ట్రోల్ చేస్తున్నారు. ఇప్పటివరకు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించిన వసూళ్ల పోస్టర్లు అన్నీ కేవలం ప్రమోషన్ల కోసం, హైప్ క్రియేట్ చేయడం కోసం వేసిన నంబర్లేనని నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. కిరణ్ అబ్బవరం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి చేసిన ఈ చిత్రంపై ఇలాంటి కలెక్షన్ల దుమారం రేగడం చర్చనీయాంశమైంది. మరి సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ నెగిటివ్ ప్రచారంపై మరియు నిర్మాత వ్యాఖ్యలపై హీరో కిరణ్ అబ్బవరం కానీ, చిత్ర బృందం కానీ ఎలాంటి క్లారిటీ ఇస్తారో చూడాలి.

# బాలయ్య సినిమాలో

## కాజల్ పాత్రపై క్లారిటీ..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ రెండో ఇన్నింగ్స్‌లోనూ వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఒకవైపు మహిళా ప్రధాన చిత్రాల్లో నటిస్తూ తనదైన ముద్ర వేస్తూనే, మరోవైపు స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రలను పోషిస్తూ బిజీగా ఉంది. ఇటీవల కమల్ హాసన్‌తో ఇండియన్ 3 లో కనిపించిన కాజల్, ఇప్పుడు నందమూరి బాలకృష్ణతో మరోసారి జతకట్టనుంది. ఇప్పటికే 'భగవంత్ కేసరి' సినిమాలో బాలకృష్ణ సరసన నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న కాజల్ అగర్వాల్, ఇప్పుడు బాలయ్య కెరీర్‌లో 111వ చిత్రంగా తెరకెక్కుతున్న చీదీఖ111లో మరో కీలక పాత్రలో కనిపించబోతోంది. ఈ సినిమాకు సంబంధించిన ఆమె ఫస్ట్ లుక్‌ను ఇటీవల చిత్ర బృందం విడుదల చేయగా, సోషల్ మీడియాలో మంచి స్పందన లభించింది. కొద్ది రోజులుగా ఈ సినిమాలో కాజల్ పాత్రపై ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగా ఆమె ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారిణి పాత్రలో నటిస్తోందని, కథలో అత్యంత కీలకమైన పాత్ర ఆమెదేనని ప్రచారం జరుగుతోంది. యాక్షన్, ఇన్వెస్టిగేషన్ నేపథ్యంతో సాగే ఈ పాత్ర సినిమా కథను కీలక మలుపులు తిప్పుతుందని టాక్ వినిపిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కాజల్ అగర్వాల్ తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఈ సినిమాలో నా పాత్ర ఫన్నీగా ఉండదు. చాలా సీరియస్‌గా ఉంటుంది అని స్పష్టం చేసింది. దీంతో ఇప్పటివరకు వినిపిస్తున్న ప్రచారానికి మరింత బలం చేకూరింది. ఆమె వ్యాఖ్యలతో ఈ సినిమాలో కాజల్ పూర్తిగా కొత్త షేడ్‌లో కనిపించబోతున్నట్లు అర్థమవుతోంది. గతంలో గ్లామర్, రొమాంటిక్ పాత్రల్లో ఎక్కువగా కనిపించిన కాజల్, ఈసారి ఇంటెన్స్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కాజల్ చేసిన వ్యాఖ్యల తర్వాత సోషల్ మీడియాలో మరో ఆసక్తికర చర్చ మొదలైంది. సినిమాలో బాలకృష్ణ, కాజల్ పాత్రల మధ్య బలమైన సంఘర్షణ ఉండే అవకాశముందని అభిమానులు చర్చించుకుంటున్నారు. ఒకవేళ ఆమె నిజంగానే క్రైమ్ బ్రాంచ్ అధికారిణి పాత్రలో నటిస్తే, కథలో బాలయ్యతో ఆమెకు సంబంధించిన సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.అయితే చిత్ర బృందం ఇప్పటివరకు ఆమె పాత్రపై అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. అందువల్ల పూర్తి క్లారిటీ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న చీదీఖ111పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో బాలకృష్ణను మరో పవర్‌ఫుల్ అవతార్‌లో చూపించేందుకు దర్శకుడు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



# 'మైసా' కోసం రష్మిక సాహసం..

## నీటిలో భారీ యాక్షన్ సీక్వెన్స్




స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస పాన్ ఇండియా చిత్రాలతో ఫుల్ బిజీగా ఉంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో భారీ ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న ఈ నేషనల్ క్రష్, ఇప్పుడు మరో ప్రతిష్టాత్మక చిత్రం మైసాతో వార్తల్లో నిలిచింది. ఇప్పటికే ఈ సినిమాపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా మేకర్స్ వెల్లడించిన అప్‌డేట్ ఆ ఆసక్తిని మరింత పెంచింది. నూతన దర్శకుడు రవీంద్ర పుల్లే దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మైసా' ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక మందన్న ఇప్పటివరకు ఎప్పుడూ చేయని ఓ సరికొత్త పాత్రలో కనిపించనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే వెల్లడించింది. ఆమె కెరీర్‌లోనే ఇది అత్యంత ఛాలెంజింగ్ రోల్స్‌లో ఒకటిగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి కీలక అప్‌డేట్‌ను మేకర్స్ పంచుకున్నారు. చిత్రంలో అత్యంత కీలకమైన అండర్‌వాటర్ యాక్షన్ సీక్వెన్స్‌ను రష్మిక విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ సన్నివేశం కోసం ఆమె ప్రత్యేక శిక్షణ తీసుకుని షూటింగ్‌లో పాల్గొన్నట్లు సమాచారం. నీటిలో చిత్రీకరించిన ఈ ఎపిసోడ్ సినిమా మొత్తంలోనే హైలైట్‌గా నిలుస్తుందని, ఇప్పటికే చిత్రీకరించిన విజువల్స్ అద్భుతంగా వచ్చాయని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి.ప్రస్తుతం 'మైసా' ఆరో ప్రధాన షూటింగ్ షెడ్యూల్‌లో ఉంది. ఈ షెడ్యూల్‌తో సినిమా చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. మిగిలిన సన్నివేశాలను త్వరలో పూర్తి చేసి, అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. షూటింగ్ పూర్తయిన వెంటనే సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించేందుకు నిర్మాతలు సిద్ధమవుతున్నారని సమాచారం. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల చేయాలనే లక్ష్యంతో మేకర్స్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ హై-ఇంటెన్స్ థ్రిల్లర్‌కు ప్రముఖ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. కథలో సంగీతానికి కూడా కీలక ప్రాధాన్యం ఉంటుందని తెలుస్తోంది. అలాగే నటుడు తారక్ పొన్నప్ప ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్ర కూడా కథలో అనూహ్యమైన మలుపులు తీసుకొస్తుందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# విజయ్ అభిమానులకు భారీ సర్‌ప్రైజ్..

### జన నాయగన్ థియేటర్లలోకి ఎప్పుడు వస్తుందంటే!



కోలీవుడ్ స్టార్ హీరో, ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయ్ నటించిన చివరి చిత్రంగా ప్రచారం పొందిన 'జన నాయకన్' సినిమాకి సంబంధించిన భారీ అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఎన్నో వాయిదాలు, అనేక అడ్డంకులు ఎదుర్కొన్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం విడుదల తేదీపై తాజాగా సినీ వర్గాల్లో ఆసక్తికర సమాచారం చక్కర్లు కొడుతోంది. దీంతో చాలా కాలంగా ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న విజయ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. గతంలో ఈ చిత్రాన్ని పలుమార్లు విడుదల చేయాలని ప్లాన్ చేసినప్పటికీ, వివిధ కారణాలతో రిలీజ్ వాయిదా పడుతూ వచ్చింది. ముఖ్యంగా విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి, అనంతరం తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ సినిమాకు సంబంధించిన అధికారిక అప్‌డేట్స్ దాదాపు నిలిచిపోయాయి. దీంతో సినిమా విడుదలపై అభిమానుల్లో అనేక సందేహాలు నెలకొన్నాయి.అయితే తాజా సమాచారం ప్రకారం 'జన నాయకన్' ప్రపంచవ్యాప్తంగా జూలై 24, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. విదేశీ డిస్ట్రిబ్యూటర్లకు కూడా ఇదే రిలీజ్ డేట్‌ను అధికారికంగా తెలియజేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్వరలోనే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సినిమా విజయ్ సినీ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో ఒకటిగా నిలవనుంది. నటుడిగా ఆయన చివరి చిత్రం కావడం వల్ల అభిమానుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రాజకీయ, యాక్షన్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం విజయ్‌కు గ్రాండ్ ఫేర్‌వెల్ మూవీగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. యువ నటి మమితా బైజు కూడా కీలక పాత్రలో కనిపించనుండగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్, దర్శకుడు-నటుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్, సీనియర్ నటుడు ప్రకాశ్ రాజ్, ప్రియమణి, నరైన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ సినిమా కథపై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని ఖఎచీ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. విజయ్-అనిరుధ్ కాంబినేషన్‌లో వచ్చిన గత చిత్రాల పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించిన నేపథ్యంలో, 'జన నాయకన్' సంగీతంపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

## లోకం సంకెళ్లు తెంచేద్దాం



యశ్ కథానాయకుడిగా నటిస్తున్న 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' సినిమాపై ఇప్పటికే భారీ హైప్‌క్రియేట్ అయింది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఆగస్ట్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో యశ్ జోడీగా ఐదుగురు కథానాయికలు నటించారు. నదియా పాత్రలో కియారా అద్వాణీ కనిపించనుంది. ఈ సినిమాలోని తొలిగీతం 'తబాహీ' వీడియోను బుధవారం విడుదల చేశారు. ఇందులో యశ్, కియారా అద్వాణీ కెమిస్ట్రీ హైలైట్‌గా నిలిచింది. విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. 'లోకం సంకెళ్లు తెంచేద్దాం..కాలం పరదాలు కాల్చేద్దాం..మనకై మనమై జీవించుదాం..తబాహీ' అంటూ ఈ పాట సాగింది. విశాల్ మిశ్రా స్వరపరచిన ఈ పాటను తెలుగులో రామజోగయ్యశాస్త్రి రచించారు. 'తబాహీ' సాధారణ ప్రేమగీతం కాదని, ప్రేమలోని త్యాగం.. భావోద్వేగాలను ప్రతిబింబిస్తుందని, గాఢమైన ప్రణయభావాల్ని ఈ పాటలో ఆవిష్కరించామని సంగీత దర్శకుడు విశాల్‌మిశ్రా తెలిపారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్నది.

# కోర్టు రూమ్ డ్రామా 'డ్యూ డేట్'



కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందుతున్న 'డ్యూ డేట్' చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమా ద్వారా ఫిల్మ్ జర్నలిస్ట్‌గా సుపరిచితుడైన ఏలూరు శ్రీను నిర్మాతగా మారుతున్నారు. మరో నిర్మాత పవన్ తరిగోపులతో కలిసి వర్షిష్ స్టూడియోస్ పతాకంపై ఆయన ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. లోమేష్ పూడిపెద్ది, జయశ్రీ, ప్రణీత పట్నాయక్, విజ్ఞాని, చందు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రానికి ఆనంద్.కె దర్శకత్వం వహిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు మారుతి క్లాప్‌నివ్వగా, బన్నీ వాస్ కెమెరా స్విఛాన్ చేశారు.(నిర్మాతలు ఎస్కేఎన్, ధీరజ్ మొగిలినేని, వంశీ నందిపాటి దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందజేశారు. సమాజంలోని ఓ సీరియస్ ఇష్యూని ఈ సినిమాలో చర్చించబోతున్నామని, ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే కోర్ట్‌డ్రామాగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని, త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: చెంచు జింక, నిర్మాతలు: ఏలూరు శ్రీను, పవన్ తరిగోపుల, దర్శకత్వం: ఆనంద్.కె.

# ఆన్లైన్ ద్వారా పూర్తి చేసిన ఫామ్ ను సద్దాంకు అందచేసిన అఫ్రోస్ పటేల్



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ఎన్ఐఆర్ (సర్) ప్రక్రియపై ప్రతి ఓటరికి అవగాహ కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని బి ఆర్ ఎస్ మైనార్టీ సీనియర్ నాయకుడు అఫ్రోస్ పటేల్ తెలిపారు. బాగ్ అంబర్పేట్ రెడ్ బిల్డింగ్ వద్ద గత వారం రోజులుగా సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆన్లైన్ ఆఫ్లైన్ పద్ధతిలో ప్రజలకు మరింత సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా అంబర్పేట్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు మొహమ్మద్ సద్దాం హుస్సేన్ ఏనుమేరేషన్ ఫామ్ ను ఆన్లైన్ ద్వారా విజయవంతంగా పూర్తి చేశారు. ఆ ఫామ్ ను మొహమ్మద్ సద్దాం హుస్సేన్ కు అఫ్రోస్ పటేల్ , మొహమ్మద్ అజార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఓలు వారికి కేటాయించిన పోలింగ్ బూత్ల పరిధిలో ఎన్యుమరేషన్ పత్రాలను ఓటర్లకు పంపిణీ చేసి వివరాలు సక్రమంగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియ గురించి వివరించి అవగాహన కల్పించేందుకు తను పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. తాము డివిజన్ ప్రజల కోసం మూడు హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశామని వారు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తప్పులు ఉంటే సరిచేసుకునే అవకాశం ఉందని .అప్రమత్తంగా లేకపోతే ఓటు గల్లంతయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారులుగా గంగపుత్రులకు గుర్తించి నియమిత పదవులలో ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత కల్పించాలి

**టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్)కేంద్రంగా తెలంగాణ అమరజ్యోతి ప్రాంగణంలో తెలంగాణ ఉద్యమకారుల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కీలక సమావేశంలో తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న సాంప్రదాయ మత్యకార గంగపుత్ర కులస్తులను ఉద్యమకారులుగా గుర్తింపుతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నియమిత పదవులలో సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ ఉద్యమ కమిటీ సభ్యుడు శాసన మండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాంకు వినతి పత్రం అందచేసారు ఈ సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో ఉద్యమ నాయకులుగా ఎంతో కీలకంగా వ్యవహరించిన వరంగల్ ఉమ్మడి జిల్లాకు ఉద్యమ నాయకులు ప్రముఖ న్యాయవాది అంబటి శ్రీనివాస్ గంగపుత్ర ప్రముఖ విద్యావేత్త డోలి సత్యనారాయణ గంగపుత్రులకు రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలంటూ తెలంగాణ రాష్ట్రంలో సాంప్రదాయ మత్యకార గంగపుత్ర కులస్తులు కేవలం చేపల వేట చేపలం అమ్మకమే కుల వృత్తిగా జీవనం సాగిస్తూ నిరు పేదరికంలో ఉన్నారన్నారు కావున గంగపుత్ర కులాన్ని తెలంగాణ ఉద్యమ సంఘంగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వ నియమిత పదవులలో సంక్షేమ పథకాలలో గంగపుత్రులకు మొదటి ప్రాధాన్యత కల్పించగలరని తెలంగాణ ఉద్యమ కమిటీని విజ్ఞప్తి చేశారన్నారు

# శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో 2026 జూలై 17వ తేదీ నుండి నిర్వహించనున్న శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల గోడపత్రికలను నేడు స్థానిక శాసనసభ్యులు శ్రీ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజస్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడే ఆధ్యాత్మిక వేడుకలని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని ఆకాంక్షించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.కె. వెంకటేశులు మాట్లాడుతూ,

బ్రహ్మోత్సవాలను సంప్రదాయబద్ధంగా, వైభవోపేతంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని పుణ్యఫలాన్ని పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు కె. వైశాలి, కె . నాగరాజు, జి . గోపీనాథ్, డి. లక్ష్మమ్మ ప్రత్యేక ఆహ్వానితులు సి. శైలజ, ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి ఎన్.ఆర్. కృష్ణారెడ్డి , హేమమాలిని , పర్యవేక్షకులు శ్రీ హరి , ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి , ఆలయ పర్యవేక్షకులు సి. నాగభూషణం యాదవ్ , టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి , ప్రోటోకాల్ లోకేష్ బాబు , అనుబంధ ఆలయాల ఛైర్మన్ లు బోర్డు సభ్యులు మరియు తెలుగు దేశం పార్టీ నాయకులు , దేవస్థానం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "అశోక్ మరణం వెనుక ఎవరు?

- ఫోన్ కాల్ డేటా బయటపెడితేనే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయా?"
- సింగిల్ విండోలో అసలేం జరిగింది?
- మానసిక వేధింపులే అశోక్ ప్రాణం తీశాయా?
- ఫోన్ కాల్స్, డేటాపై సమగ్ర దర్యాప్తు చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్?
- అశోకు మరణాన్నికి కారకులెవరు?



మంథని( ప్రశ్న న్యూస్) సింగిల్ విండోకు చెందిన అశోక్ ఆకస్మిక మరణం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇది సహజ మరణం కాదని, కొంతమంది వ్యక్తులు నిరంతరం మానసికంగా వేధించడం, ఒత్తిడికి గురిచేయడం వల్లే ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అశోక్ను ఎవరు, ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారనే అంశంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని ఆయన భార్య, కుమారులు కోరుతున్నారు. ముఖ్యంగా ఆయన మొబైల్ ఫోన్లోని కాల్ హిస్టరీ, మెసేజ్లు, ఇతర డిజిటల్ డేటాను ఫోరెన్సిక్ పరీక్షకు పంపించి, అందులోని వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. తన భర్త ఎంతో సున్నిత మనస్తత్వం కలిగిన వ్యక్తి అని, కొంతకాలంగా ఫోన్ కాల్స్ ద్వారా ఒత్తిడి, గత కొంతకాలంగా సరిగా రాత్రుల్లో నిద్ర కూడా సరిగ్గా పోయేవాడు కాదని ఎప్పుడు ఫోన్లు మాట్లాడుతూ ఆందోళన చెందేవాడని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఆ మానసిక వేదనను తట్టుకోలేక చివరకు గుండెపోటుకు గురయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అశోక్ మరణానికి ముందు ఎవరెవరు ఫోన్ చేశారు? ఆ కాల్స్లో ఏమి మాట్లాడారు ఏదైనా బెదిరింపులు లేదా ఒత్తిళ్లు జరిగాయా అనే అంశాలపై పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అశోక్ మరణానికి సంబంధించిన పూర్తి నిజాలు వెలుగులోకి రావాలంటే ఆయన మొబైల్ ఫోన్లోని కాల్ డేటా, ఇతర డిజిటల్ ఆధారాలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. **గమనిక: పై కథనం కుటుంబ సభ్యులు వ్యక్తం చేసిన ఆరోపణలు, అనుమానాల ఆధారంగా రూపొందించబడింది. ఈ ఆరోపణలు అధికారిక దర్యాప్తులో ఇంకా నిర్ధారణ కాలేదు. పోలీసులు నిర్వహించే విచారణ అనంతరం మాత్రమే వాస్తవ పరిస్థితులు స్పష్టమవుతాయి.**

# డి ఎం హెచ్ ఓ గా డా. ఆనంద్ బాధ్యతల స్వీకరణ

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డా. కె. ఆనంద్ బాధ్యతల ను స్వీకరించారు. మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డా. సి. ఉమా గౌరి ని పరిపాలనా కారణాల దృష్ట్యా తక్షణ ప్రభావంతో రిలీవ్ చేసి, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ సంచాలకులు, హైదరాబాద్ కార్యాలయంలో రిపోర్ట్ చేయవలసిందిగా ఆదేశించారు. అదే ఉత్తర్వుల ప్రకారం, ప్రస్తుతం నిలోఫర్ ఆసుపత్రి, హైదరాబాద్లో సివిల్ సర్జన్ ఆర్.ఎం.ఓ గా విధులు నిర్వహిస్తున్న డా. కె. ఆనంద్ ను మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా (డీఎంహెచ్ఓ) ఇన్చార్జిగా తక్షణ ప్రభావంతో నియమించారు. ఈ మేరకు డా. కె. ఆనంద్ మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ మను చౌదరిని, అదనపు కలెక్టర్ (యూఎల్బీ) ఫైజాన్ అహ్మద్ ను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య, ఆరోగ్య సేవలను అందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేస్తానని డా. కె. ఆనంద్ తెలిపారు. జిల్లాలో అమలులో ఉన్న ప్రజారోగ్య కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య పథకాలు మరియు సంక్షేమ కార్యక్రమాల అమలును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. డా. కె. ఆనంద్ కు మెడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పరిపాలనా ప్రజారోగ్య అనుభవం ఉంది. ఆయన గతంలో మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా, మెడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్గా, అలాగే జిల్లా మాతా శిశు సంక్షేమ కార్యక్రమ, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా



అధికారిగా విజయవంతంగా విధులు నిర్వహించారు. జిల్లాలోని ఆరోగ్య వ్యవస్థ, ప్రజారోగ్య కార్యక్రమాలు మరియు మాతా-శిశు సంక్షేమ సేవల అమలుపై ఆయనకు విస్తృత అవగాహన అనుభవం ఉంది.

# వీరికి చట్టాలు వర్తించవా.?

- -ములుగులో మద్యం మాఫియా, బెల్ట్ షాపుల రాజ్యం
- -ఆదివాసీ గ్రామాల్లోనే సిండికేట్.. "అమాయకులం కాబట్టే టార్గెట్" నరసింహమూర్తి
- -ఎం ఆర్ పి కంటే రూ.60 అదనం: వాజేడు, వెంకటాపురం తాడ్వాయిలో బెల్ట్ షాపుల హవా.
- -ఎక్సైజ్ నిద్ర, పోలీసుల మౌనం: ములుగు జిల్లాలో వేల సంఖ్యలో అక్రమ షాపులు.
- -పిల్లలకు తిండి లేదు, బెల్ట్ షాపులపై మహిళల ఆగ్రహం,

**సిండికేట్ హవా:** వాజేడు, వెంకటాపురం, కన్నాయి గూడెం, తాడ్వాయి మండలాల్లో అధికారిక వైన్ షాపులకు తోడు వందలాది అక్రమ బెల్ట్ షాపులు.

**అధిక ధరల దోపిడీ:** రూ.200 క్వార్టర్ బాటిల్ను రూ.260 వరకు అమ్ముతున్నారు. ఎం ఆర్ పి కంటే రూ.40-60 ఎక్కువ వసూలు.

**ఆదివాసులను టార్గెట్:** అమాయక ఆదివాసులు ఉన్న చోటనే సిండికేట్ ఏర్పడుతోందని ఆదివాసి కుల సంఘాల ఆరోపణ.

**సరఫరా నెట్వర్క్:** గ్రామాల్లో లక్షల్లో మద్యం నిల్వ చేసి ఇతర గ్రామాలకు సరఫరా చేస్తున్నట్టు స్థానికుల ఆరోపణ.

**ప్రజల డిమాండ్:** వెంటనే దాడులు చేసి బెల్ట్ షాపులు మూసివేయాలని మహిళా, ఆదివాసి సంఘాల డిమాండ్.

ములుగు (ప్రశ్న న్యూస్) జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, కన్నాయి గూడెం, తాడ్వాయి మండలాల్లో మద్యం సిండికేట్ రాజ్యమేలుతోంది. ప్రభుత్వం అనుమతించిన వైన్ షాపులు కొన్ని మాత్రమే ఉండగా, గల్లీ గల్లీకి అక్రమ బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఫలితంగా ఈ నాలుగు మండలాల్లోని యువత, కూలీలు మద్యానికి బానిసలుగా మారుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం ఈ నాలుగు మండలాల్లో అధికారిక మద్యం దుకాణాలు వేళ్లపై లెక్కించేన్ని మాత్రమే ఉన్నాయి. కానీ అక్రమ బెల్ట్ షాపులు మాత్రం వందల సంఖ్యలో ఉన్నాయి. ఈ బెల్ట్ షాపులన్నీ సిండికేట్ గా పని చేస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి.

## ఎం ఆర్ పి కంటే రూ.60 అదనం

అక్రమ షాపుల్లో మద్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మార్కెట్ లో రూ.200 ఉన్న క్వార్టర్ బాటిల్ను రూ.260 వరకు అమ్ముతున్నారు. ఒక్కో బాటిల్ పై రూ.40 నుండి రూ.60 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. రోజువారీ కూలీ చేసుకుని బతికే కుటుంబాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది.స్థానిక మహిళా మాట్లాడుతూ మా ఆయన రోజూ సంపాదన మొత్తం అక్కడే పెట్టొస్తాడు. పిల్లలకు తిండి కూడా లేదు. పోలీసులు, ఎక్సైజ్ వాళ్లు పట్టించుకోవడం లేదు" అని ఆవేదన వ్యక్తం చేసింది.

## అమాయకులం కాబట్టే మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారు.

ఈ వ్యవహారంపై ఆదివాసి కుల సంఘాల నాయకుడు నరసింహమూర్తి తీవ్రంగా స్పందించారు. కొర్సా నరసింహమూర్తి, ఆదివాసి కుల సంఘాల నాయకుడు మాట్లాడుతూ కేవలం అమాయకులమైన ఆదివాసులు ఉన్న చోటనే ఈ సిండికేట్ ఏర్పడుతుంది.

ఇదే వ్యాపారం మైదాన ప్రాంతంలో జరిగితే చట్టాలు అన్నీ కఠినంగా అమలవుతాయి. కానీ మా గిరిజన ప్రాంతాల్లో మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆదివాసుల బతుకుల కంటే ప్రభుత్వానికి విలువ లేదా? వెంటనే స్పందించి మా ఆదివాసులకు న్యాయం చేయాలి. లేకుంటే మేము పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం" అని డిమాండ్ చేశారు.




## ఆదివాసీ ప్రాంతాల్లోనే ఎక్కువగా

రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా ఆదివాసులు ఎక్కువగా నివసించే ఈ ప్రాంతాల్లోనే ఈ అక్రమ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కొన్ని గ్రామాల్లో లక్షల రూపాయల విలువైన మద్యం నిల్వ చేసి, చుట్టుపక్కల గ్రామాలకు సరఫరా చేస్తున్నట్టు సమాచారం.ఒక్కో బెల్ట్ షాపులో రోజుకి వేల రూపాయల మద్యం అమ్ముతున్నారు. కంప్లైంట్ ఇచ్చినా ఎలాంటి యాక్షన్ ఉండదు అని మరో స్థానికుడు ఆరోపించాడు.

## అధికారులపై విమర్శలు

ఇంతా జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు నిద్రావస్థలో ఉన్నారని, పోలీస్ శాఖ చోద్యం చూస్తుందని ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వ చట్టాలు ఈ ప్రాంతాలకు వర్తించడం లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇప్పటికైనా స్పందించి అక్రమ బెల్ట్ షాపులపై విస్తృత దాడులు చేసి, యువతను ఈ మహమ్మారి నుండి కాపాడాలని మహిళా, ఆదివాసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తమ డిమాండ్లు నెరవేరకుంటే ఎక్సైజ్ కార్యాలయాల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.మద్యం దందాపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# బంగారు గుండ్ల కోసం వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు, రూ.6 వేల జరిమానా

## శిక్ష పడేందుకు కృషి చేసిన సిబ్బందిని అభినందించిన

మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ 0 మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఖాద్లూర్ గ్రామానికి చెందిన శివకుమార్ (28) బంగారు గుండ్ల కోసం ఓ వృద్ధురాలిని గొంతు పిసికి హత్య చేసిన కేసులో జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.6 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఖాద్లూర్ గ్రామ శివారులోని దత్తాత్రేయ ఆశ్రమాన్ని నిర్వహిస్తూ 75 ఏళ్ల అంజమ్మ ఒంటరిగా నివసించేది. ఆమె మేనల్లుడు రాములు ప్రతిరోజూ ఆమెకు భోజనం తీసుకెళ్లేవాడు. 2024 ఆగస్టు 7న రాత్రి సుమారు 10:20 గంటలకు విధులు ముగించుకొని అంజమ్మను చూడడానికి వెళ్లిన రాములు ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా ఆమె మృతదేహంగా కనిపించింది. అదే సమయంలో గుడిసెలో ఒక మూలన దాక్కొని ఉన్న శివకుమార్ను గుర్తించిన రాములు, "ఇక్కడ ఏమి చేస్తున్నావు?" అని ప్రశ్నించగా, శివకుమార్ కర్రతో దాడి చేయడానికి ప్రయత్నించాడు. రాములు తప్పించుకోగా, నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం జరిగిన దర్యాప్తులో అంజమ్మను గొంతు పిసికి హత్య చేసి, ఆమె ధరించిన బంగారు గుండ్లను అపహరించినట్లు తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారులు సీఐలు రాజశేఖర్ రెడ్డి, రేణుక రెడ్డి సమగ్రంగా విచారణ చేపట్టి పక్కా సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో చార్జ్షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు శివకుమార్ను దోషిగా తేల్చి జీవిత ఖైదుతో పాటు రూ.6 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో టేక్మాల్ ఎస్ఐ అరవింద్, లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ కృష్ణ సహకరించారు. ఈ కేసును విజయవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష




పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

# ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు నత్తనడకన.?


**-45 లక్షల చోరీ కేసులో కుషాయిగూడ పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు**

**- దొంగల కన్నా ఫిర్యాదుదారులపైనే ప్రశ్నల వర్షం**

**- సీసీటీవీ ఫుటేజ్‌లు ఉన్నా ముందుకు సాగని విచారణపై బాధితుల ఆవేదన**

**- సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాస్ వ్యవహారశైలిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు**

కాప్రా(ప్రశ్న న్యూస్) కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దాదాపు రూ.45 లక్షల చోరీ జరిగిన కేసు దర్యాప్తు తీరుపై బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీన చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌లను


FIRST INFORMATION REPORT
(Under section 173 and 176 BNSS)
T.S.P.M. Orders 470,500
1. District: Malkajgiri P.S. Kushaiguda Year 2026 FIR No. Date 27-06-2026
2. Acts & Section(s): 305(a) BNS
3. a) Occurrence of Offence: Day Thursday Date & Time From 24-06-2026
Date & Time To 25-06-2026 Prior To Time Period
b) Information Received at P.S.: Date & Time 27-06-2026
General Diary Reference: Entry No 36 Date & Time 27-06-2026
4. Type of Information: Written
5. Place of Occurrence:
a) Distance and Direction From P.S.: 2 kms. South Beat No. 1
b) Address Place Area/Mandal Uppal Street/Village
City/District MEDCHAL MALKAJGIRI State Telangana PIN
c) In case, outside the limit of this Police Station, then
Name of P.S. District
6. Complainant / Informant:
a) Name Sri. Nandra Sai Mahesh
b) Father's /Husband's Name Satyanarayana
c) Date/Year of Birth Age 26 Years
d) Nationality India e) Caste Reddy
f) Passport No Date of Issue Place of Issue
g) Occupation Mobile No.
h) Address House No Area/Mandal Uppal Street/Village
City/District MEDCHAL MALKAJGIRI State TELANGANA PIN
7. Details of known/suspected/unknown accused with full particulars:
Serial No : 1
a) Name
b) Father's /Husband's Name

కూడా అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ, అసలు నిందితులను గుర్తించి సొమ్ము రికవరీ చేసే దిశగా దర్యాప్తు అసలు ముందుకు సాగడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.బాధితుల వివరాల ప్రకారం డిటెక్టివ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాస్‌లు చోరీకి పాల్పడిన వారిపై దృష్టి పెట్టకుండా, ఫిర్యాదుదారులనే పదేపదే పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఇంత డబ్బు మీకు ఎలా వచ్చింది.? అనే ప్రశ్నలతో



ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాటికి సంబంధించిన ఆధారాలు సైతం చూపించామని అయినా పదేపదే దానికోసమే మాట్లాడుతూరని బాధితులు పేర్కొంటున్నారు. చోరీ జరిగిన డబ్బును రికవరీ చేయడం, నిందితులను గుర్తించడం వంటి ప్రాథమిక దర్యాప్తు అంశాలను పక్కనబెట్టి, ఫిర్యాదుదారులనే అనుమానితుల్లా ప్రశ్నించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.ఫిర్యాదు చేసిన లహరి, మహేష్ అనే వ్యక్తిని పోలీస్ స్టేషన్‌లో దుర్భాషలాడడమే కాకుండా దాడి చేసినట్లు కూడా బాధితులు ఆరోపిస్తున్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కు వెళ్తే బాధితులకు ఇలానే చేస్తారా అని బోరున విలపిస్తున్నారు. మరో బాధితురాలు లహరి, రూ.45 లక్షలు పోయాయన్న ఆవేదనతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.సీసీటీవీ ఫుటేజ్‌లలో అనుమానితుల కదలికలు ఉన్నప్పటికీ, వారిని శాస్త్రీయ పద్ధతుల్లో విచారించి సొమ్ము రికవరీ చేసే దిశగా కనీస చర్యలు కనిపించడం లేదని బాధితులు వాపోతున్నారు. “నిందితులు తామే చోరీ చేశామని ఒప్పుకోవడం లేదని, అందుకే రికవరీ




చేయలేము” అని పోలీసులే చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని వారు పేర్కొంటున్నారు. నేరాన్ని ఛేదించడం పోలీసుల బాధ్యతే తప్ప, నిందితులు స్వయంగా ఒప్పుకుంటేనే కేసు పరిష్కారం అవుతుందా అని ప్రశ్నిస్తున్నారు.

న్యాయపరంగా చూస్తే, చోరీ జరిగిన కేసులో ముందుగా నిందితులను గుర్తించడం, సాక్ష్యాధారాల ఆధారంగా దర్యాప్తు పూర్తి చేయడం, దొంగిలించిన సొమ్మును స్వాధీనం చేసుకోవడం పోలీసుల విధి. అనంతరం ఆ సొమ్ముపై చట్టబద్ధమైన యాజమాన్యాన్ని నిర్ధారించి సంబంధిత ప్రక్రియ ద్వారా బాధితులకు అప్పగించడం జరుగుతుంది. అయితే ఈ ప్రక్రియను పక్కనబెట్టి, ఫిర్యాదుదారులనే పదేపదే విచారించడం వెనుక సీఐ వెంకటేశ్వర్లు ఉద్దేశం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు.ఈ వ్యవహారంపై సీఐ వెంకటేశ్వర్లను వివరణ కోరగా, “సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కొందరిని ప్రశ్నించాం. అయితే వారు డబ్బు తీసుకున్నట్లు ఒప్పుకోవడం లేదు. అందువల్ల రికవరీ సాధ్యం కావడం లేదు” అని చెప్పినట్లు బాధితులు తెలిపారు. బాధ్యతాయుతమైన పోలీసు అధికారి నుంచి ఇటువంటి సమాధానాలు రావడం ప్రజల్లో పోలీసు వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఉన్నత అధికారులేమో పోలీసు వ్యవస్థను ఎలా బలోపేతం చేయాలి. ప్రజల సమస్యలు ఎలా తీర్చాలి అని ప్రయత్నిస్తుంటే కిందిస్థాయి అధికారుల తీరు ఇలా ఉండడంతో ప్రజలు పోలీస్ స్టేషన్ కు వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. రూ.45 లక్షలు అనేది భారీ చోరీకి సంబంధించిన ఫిర్యాదు కాబట్టి ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని ప్రత్యేక శ్రద్ధతో కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని, సీసీటీవీ ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి రూ.45 లక్షల సొమ్మును రికవరీ చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు ఉప్పల్ జోన్ డీసీపీ, మల్కాజ్గిరి పోలీసు కమిషనర్‌ను కోరుతున్నారు.


# సమస్యలకు నిలయంగా చర్లపల్లి డివిజన్

**పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, పట్టించుకోని అధికారులు**

**కోట్లాది రూపాయల నిధులు ఎటు.? అభివృద్ధి మాత్రం శూన్యం**

**మాజీ మేయర్, కార్పొరేటర్ల హయాంలో డివిజన్ అభివృద్ధి గాడి తప్పిందా.?**

**ప్రజల కష్టాలు పెరుగుతున్నా పాలకులకు కనిపించని దుస్థితి**



నాచారం (ప్రశ్న న్యూస్)ఒకప్పుడు పారిశ్రామికంగా, నివాస ప్రాంతంగా వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశించిన చర్లపల్లి డివిజన్ ప్రజలకు నేడు సమస్యలకు కేంద్రబిందువుగా మారిందనే విమర్శలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. కోట్లాది రూపాయల అభివృద్ధి నిధులు కేటాయించామని మాజీ, తాజా ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లో అనేక కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతూ రోడ్లపైకి మురుగునీరు చేరుతోంది. దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు, సిబ్బంది స్పందించకుండా పూర్తి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.డివిజన్ అభివృద్ధి పేరుతో ప్రతి ఏడాది కోట్లాది రూపాయల నిధులు కేటాయించినట్లు అధికారిక ప్రకటనలు వచ్చినా, ఆ నిధులతో జరిగిన పనులు ఎక్కడ ఉన్నాయో ప్రజలకు కనిపించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన రహదారులు దెబ్బతినడం, అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారడం, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండటం, పారిశుధ్య సమస్యలు రోజురోజుకూ పెరగడం, ప్రస్తుతం వెంకట్ రెడ్డి నగర్ లోని ఈ డ్రైనేజీ దుస్థితి చూస్తే అభివృద్ధి పనులపై అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. మాజీ మేయర్, కార్పొరేటర్ల హయాంలో డివిజన్ అభివృద్ధి పూర్తిగా గాడి తప్పిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

“దోచుకున్నోడికి దోచుకున్నంత” అన్న చందంగా ప్రజా ధనం ఖర్చు అయ్యిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల కంటే కాంట్రాక్టులకే ప్రాధాన్యం ఇచ్చారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ హయాంలో చర్లపల్లి డివిజన్‌కు కోట్లాది రూపాయల నిధులు కేటాయించారని అప్పట్లో ప్రకటించినప్పటికీ, ఆ నిధులతో చేపట్టిన పనులు ఎక్కడ జరిగాయో, వాటి ఫలితాలు ఏమిటో ప్రజలకు ఇప్పటికీ అర్థం కావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కేటాయించిన నిధులపై పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు. డివిజన్‌లో నాణ్యతలేని పనులు జరిగాయా.? జరిగాయా.? పనులు చేయకుండానే బిల్లులు చెల్లించారా.? అభివృద్ధి నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి.? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. అభివృద్ధి పేరిట ఖర్చు చేసిన ప్రతి రూపాయిపై సామాజిక తనిఖీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.ప్రస్తుతం చర్లపల్లి డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్య లోపాలు, దెబ్బతిన్న రహదారులు, వీధిదీపాల సమస్యలు, తాగునీటి ఇబ్బందులు ప్రజలను తీవ్రంగా వేధిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు మాత్రం కార్యాలయాలకే పరిమితమై సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. చర్లపల్లి డివిజన్ అభివృద్ధిపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే ప్రత్యేక విచారణ జరిపి, గతంలో కేటాయించిన నిధుల వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై, నిధుల దుర్వినియోగం జరిగి ఉంటే సంబంధిత ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లపై కూడా సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు

**మెల్‌బోర్న్‌లో భారతీయుల సభలో ఆల్బనీస్ ప్రశంసలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ మరోసారి ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ ఆస్ట్రేలియాకు నిజమైన మిత్రుడని, తనకు ఎంతో ఆప్తుడని అన్నారు. మెల్‌బోర్న్‌లో జరిగిన ‘మెల్‌బోర్న్ మీట్స్ మోదీ’ కార్యక్రమంలో భారతీయులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భారతీయులు హాజరయ్యారు. ఎన్నో చారిత్రక కార్యక్రమాలకు ఈ స్టేడియం వేదికగా నిలిచిందని, కానీ భారతీయుల ఈ సమావేశం అత్యంత ప్రత్యేకమైందని ఆల్బనీస్ అన్నారు. ఈ సభలో కనిపిస్తున్న ఉత్సాహమే భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న బలమైన బంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానిగా తాను రెండుసార్లు భారత్‌లో పర్యటించే అవకాశం దక్కిందని ఆల్బనీస్ గుర్తు చేసుకున్నారు. భారతదేశ అందాలు, ప్రజల ఆతిథ్యం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. 2023లో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మోదీతో కలిసి రథంలో ప్రయాణించిన అనుభవాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. అప్పట్లో గుజరాత్‌లో చూసిన ఆప్యాయత, ఇప్పుడు ఈ సభలోనూ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. భారత సంతతి ప్రజలు ఆస్ట్రేలియా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆల్బనీస్ కొనియాడారు. ఆరోగ్యం, ఐటీ వంటి రంగాల్లో తమ సేవలు అందిస్తున్నారని చెప్పారు. చిన్న వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు విద్యా రంగాన్ని కూడా బలోపేతం చేస్తున్నారని తెలిపారు. క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ముందుగా స్పందించి సాయం చేసేది భారతీయులేనని వెల్లడించారు. భారతీయుల వల్ల ఆస్ట్రేలియా మరింత బలమైన, వైవిధ్యభరితమైన దేశంగా మారిందని ఆల్బనీస్ అన్నారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య బంధాన్ని మరింత బలపరిచే సజీవ వారధి భారత సంతతి ప్రజలేనని కొనియాడారు.

# పీవోకేలో తీవ్ర ఉద్రిక్తత

**- పాకిస్థాన్‌కు 48 గంటల అల్టిమేటం!**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. జమ్ము కశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) తమ 38 డిమాండ్లను నెరవేర్చాలంటూ ఇస్లామాబాద్ ప్రభుత్వానికి 48 గంటల గడువు విధిస్తూ అల్టిమేటం జారీ చేసింది. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే తీవ్రస్థాయిలో తుది దశ పోరాటం చేపడతామని హెచ్చరించింది. ఈ నెల 27న పీఓకేలో ప్రాంతీయ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్‌లో స్థిరపడిన కశ్మీరీ శరణార్థులకు కేటాయించిన 12 అసెంబ్లీ స్థానాలను రద్దు చేయాలనే నిర్ణయం తాజా ఆందోళనలకు ప్రధాన కారణమైంది. ఈ నిర్ణయం ద్వారా పాక్ కేంద్ర ప్రభుత్వం స్థానిక రాజకీయాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటోందని జేఏఏసీ ఆరోపిస్తోంది. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో, ముజఫరాబాద్‌కు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాలని కమిటీ పిలుపునిచ్చింది. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.పౌర సమాజం, వాణిజ్య, విద్యార్థి సంఘాలతో 2023లో ఏర్పాటైన జేఏఏసీ, పెరిగిన ధరలు, విద్యుత్ ఛార్జీలు, గోధుమ పిండిపై సబ్సిడీ వంటి డిమాండ్లతో ఈ ఏడాది మే నెలలో చేపట్టిన భారీ నిరసనలతో వెలుగులోకి వచ్చింది. మంగ్లా డ్యామ్ వంటి ప్రాజెక్టుల ద్వారా స్థానికంగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌పై తమకే హక్కులు కల్పించాలని, అలాగే రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులకు కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలను రద్దు చేయాలని కమిటీ డిమాండ్ చేస్తోంది. గత కొన్ని వారాలుగా పీఓకేలో బంద్‌లు, ధర్నాలతో నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నిరసనకారులపై ఉక్కుపాదం మోపుతూ పలువురిని అరెస్ట్ చేసిందని జేఏఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఆహారం, మందుల కొరత ఏర్పడిందని, తక్షణమే మానవతా సాయం అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. పాకిస్థాన్ ఈ ప్రాంతాన్ని ‘ఆజాద్ కశ్మీర్’ అని పిలుస్తున్నప్పటికీ, ఇక్కడి సహజ వనరులను వాడుకుంటూ తమను ఆర్థికంగా అణచివేస్తోందని స్థానికులు సుదీర్ఘ కాలంగా ఆరోపిస్తున్నారు. కాగా, జమ్ముకశ్మీర్ మొత్తం తమ అంతర్భాగమేనని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసిన విషయం విదితమే.

# కొరియాలో లోకేశ్ కీలక భేటీలు

**- విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఐదో రోజు (గురువారం) ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. సియోల్‌లో కియా మోటార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీ, ఇతర ఉన్నతాధికారులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ప్రపంచ మార్కెట్ల కోసం విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.అంతకుముందు, సెమీకండక్టర్స్, ఓఎల్ఈడీ డిస్‌ప్లే పరికరాల తయారీ సంస్థ సునిక్ సిస్టమ్ సీఈవో ఎస్.డబ్ల్యూ. చుంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకు ముందుకొస్తే జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తన పర్యటనలో భాగంగా లోకేశ్ దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా చుంగ్‌తోనూ భేటీ అయ్యారు. ఏపీలో అమలు చేస్తున్న 3ఎ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని వివరించారు. ఏపీ-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో కోరారు.

# మనవడి కోసం పూరీలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి

**- ముఖ్యమంత్రిలోని తాత ప్రేమపై నెటిజన్ల ప్రశంసలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మనవడిపై ఉన్న మమకారాన్ని చాటుకున్నారు. నిత్యం రాజకీయ వ్యవహారాలు, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలతో ఎంతో బిజీగా గడిపే ఆయన, కాసేపు ముఖ్యమంత్రి హోదాను పక్కన పెట్టి మనవడి కోరికను నెరవేర్చారు. స్వయంగా పూరీలు చేసి మనవడికి అందించారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోలో రేవంత్ రెడ్డి తన మనవడితో కలిసి ఉల్లాసంగా గడుపుతూ కనిపించారు. పూరీలు కావాలని మనవడు కోరడంతో, రేవంత్ రెడ్డి స్వయంగా పిండిని ఒత్తి, నూనెలో వేయించి సిద్ధం చేశారు. ఈ వీడియోను షేర్ చేస్తూ ఒక హృద్యమైన క్యాప్షన్‌ను కూడా జోడించారు. “మనవడు అడిగితే కాదనగలనా? నిరంతరం ప్రజా సేవలో తలమునకలై ఉండే జీవితంలో మనవడితో కలిసి పూరీలు చేసిన ఈ మధుర క్షణాలు మరువలేనివి” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. రాజకీయాల్లోని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు కుటుంబ సభ్యులతో, ముఖ్యంగా మనవడితో గడిపే సమయమే తనకు ఎంతో ఊరటనిస్తుందని రేవంత్ రెడ్డి గతంలో పలు సందర్భాల్లో తెలిపారు. తాజా వీడియో ఆయన వ్యక్తిగత జీవితంలోని సున్నితమైన కోణాన్ని, ఒక నాయకుడిలోని తాత ప్రేమను ఆవిష్కరించింది. నిత్యం రాజకీయ వివాదాలు, చర్చలతో ఉండే వాతావరణంలో ఇటువంటి ఆత్మీయ దృశ్యాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

# హెచ్ఐవీ కట్టడికి కొత్త వ్యాక్సిన్

**- ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు!**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణలో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వ్యాక్సిన్ దిశగా శాస్త్రవేత్తలు కీలక పురోగతి సాధించారు. ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేసిన ఒక కొత్త వ్యాక్సిన్, కోతుల వంటి ప్రైమేట్లపై జరిపిన పరీక్షల్లో అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది. ఈ వ్యాక్సిన్ ద్వారా అత్యంత శక్తివంతమైన, విస్తృత స్థాయిలో పనిచేసే యాంటీబాడీలు ఉత్పత్తి అయినట్లు పరిశోధకులు తెలిపారు. ఈ ఫలితాలు ప్రఖ్యాత ‘నేచర్’ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ వ్యాక్సిన్‌ను లా జొల్లా ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇమ్యునాలజీ, స్క్రిప్స్ రీసెర్చ్, మరియు ఇంటర్నేషనల్ ఎయిడ్స్ వ్యాక్సిన్ ఇనిషియేటివ్ సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఇది నేరుగా వైరస్‌పై దాడి చేసే బదులు, మన రోగనిరోధక వ్యవస్థలోని ‘బి’ కణాలకు దశలవారీగా శిక్షణ ఇస్తుంది. దీనివల్ల, నిరంతరం రూపాంతరం చెందే హెచ్ఐవీలోని అనేక రకాలను గుర్తించి, నిర్వీర్యం చేయగల శక్తివంతమైన యాంటీబాడీలు తయారవుతాయి.హెచ్ఐవీ తన రూపాన్ని మార్చుకుంటూ, రక్షణ కవచాలను ఏర్పరచుకోవడం వల్ల ఇప్పటివరకు వ్యాక్సిన్ అభివృద్ధి చేయడం సవాలుగా మారింది. అయితే, ఈ కొత్త విధానం ఆ అడ్డంకులను అధిగమించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. జంతువులపై ఇంతటి సానుకూల ఫలితాలు రావడం ఇదే మొదటిసారని వారు పేర్కొన్నారు. ఈ ప్రయోగాల విజయంతో, ఇదే తరహా వ్యూహాలతో మానవులపై క్లినికల్ ట్రయల్స్ కూడా ప్రారంభమయ్యాయి. అయితే, మనుషుల్లో దీని భద్రత, సమర్థతపై పూర్తిస్థాయి డేటా రావడానికి మరికొంత సమయం పడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం హెచ్ఐవీని నియంత్రించడానికి సమర్థవంతమైన మందులు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా కొత్త ఇన్ఫెక్షన్లను అరికట్టాలంటే వ్యాక్సిన్ కీలకం. ఈ పరిశోధన ఆ దిశగా పడిన ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com.